


తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్   సంపుటి:05   సంచిక :256   ఎడిటర్ : బి. అనిల్ కుమార్   పేజిలు : 12,   వెల. 6రూ/  బుధవారం- 25 - మార్చి - 2026

## కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ జాబ్ క్యాలెండర్ ఉంది



రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు.

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాడు విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ క్యాలెండర్ ఉందని, ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం యువతకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ చూసి అంతా తుస్సుమనిపించిందని వ్యాఖ్యానించారు. మిగతా..2లో

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం



హైదరాబాద్ నగరంలో వర్షం దంచికొడుతుంది. కూకట్‌పల్లి, మియాపూర్, ఫిల్మ్ నగర్ వంటి పలు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షం కురుస్తోంది.

ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

హైదరాబాద్: నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం మారిపోయింది. కూకట్‌పల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో గట్టిగా వర్షం కురుస్తోంది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సూరారం, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షపాతం నమోదవుతోంది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు మిగతా..2లో

## బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు




- తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు.
- ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు.

హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

- గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ..
- పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు.
- మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు.
- అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు.



హైదరాబాద్, మార్చి 24: గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా? అంటూ వారిని సూటిగా ప్రశ్నించారు. వ్యవసాయంపై కేంద్రం నల్ల చట్టాలు తీసుకు వస్తే.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేశారన్నారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గిందని సీతక్క గుర్తు చేశారు. దేశంలో బడా పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్లను రుణమాఫీ చేశారు కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీజేపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. మిగతా..2లో

## విజయవాడకు మూడు గంటల్లో చేరే విధంగా రహదారి నిర్మాణం

- ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని అసెంబ్లీలో కోమటిరెడ్డి ప్రకటన




హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. విజయవాడ రహదారి ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తరువాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి

## ఒకే దేశం, ఒకే చట్టం: గుజరాత్ లో యూనిఫాం సివిల్ కోడ్ !





- గుజరాత్ లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లు ప్రవేశపెట్టిన సీఎం భూపేంద్ర పటేల్
- "ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు జరిగాయి.

ఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేసేందుకు గుజరాత్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు-2026ను గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీ యూసీసీ అమలుపై తుది నివేదికను సమర్పించిన వారం రోజుల తర్వాత ఈ బిల్లును అసెంబ్లీ ముందుకు తీసుకురావడం గమనార్హం.

## మరో ఆరు రెడీగా ఉన్నాయన్న కేంద్రం

- హర్మూజ్ దాటిన రెండు భారత ఎల్ పీజీ నౌకలు
- హర్మూజ్ నుంచి సురక్షితంగా బయటపడిన 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్‌పీజీ ట్యాంకర్లు



ఢిల్లీ : పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సరిహద్దులోని హర్మూజ్ జలసంధి నుంచి 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్‌పీజీ ట్యాంకర్లు సురక్షితంగా బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి. దేశవ్యాప్తంగా ఒక రోజు వినియోగానికి సరిపడా సుమారు 92వేల 612 టన్నుల వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. లారక్, ఖేష్మ్ ద్వీపాల మీదుగా ప్రయాణించిన ఈ నౌకల్లో ఒకదానిలో 33, మరోదానిలో 27 మంది భారత నావికులు ఉన్నారు. మార్చి 26 నుంచి 28 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. ఇప్పటికే శివాలిక్, నందా దేవి వంటి గ్యాస్ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో దేశ ఇంధన అవసరాలకు కొంత ఊరట లభించనుంది.

**హర్మూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదు :**

మిగతా..2లో

## ఇరాన్ కొత్త సెక్యూరిటీ చీఫ్‌గా మహమ్మద్ జోల్‌ఘాద్

- పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తమ ప్రతీకార దాడులను మరింత తీవ్రతరం చేసింది.
- ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలతో పాటు, పశ్చిమాసియాలోని పలు అమెరికా సైనిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.
- ఇరాన్ ప్రయోగించిన 19 డ్రోన్లను ధ్వంసం చేసిన సౌదీ రక్షణ బలగాలు




ఢిల్లీ :సౌదీ అరేబియాలోని చమురు నిక్షేపాలున్న తూర్పు ప్రావిన్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రయోగించిన 19 డ్రోన్లను సౌదీ రక్షణ బలగాలు ధ్వంసం చేశాయి. బహ్రెయిన్‌లో క్షిపణి హెచ్చరిక సైరన్లు మోగాయి. డ్రోన్ దాడుల కారణంగా బహ్రెయిన్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బహ్రెయిన్ రీజియన్‌లో సేవలను పూర్తిగా పునరుద్ధరించే వరకు, ప్రభావితమైన తమ కస్టమర్లను ఇతర ప్రత్యామ్నాయ 'బాబా' రీజియన్లకు మార్చేందుకు అవసరమైన సహాయం అందిస్తున్నట్లు అమెజాన్ స్పష్టం చేసింది.

## ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా ప్రజాదర్బార్ లో నారా లోకేశ్ హామీ




- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన ప్రజలు, కార్యకర్తలు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి హామీ
- న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని వినతులు

అమరావతి : ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన 'ప్రజా దర్బార్' విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజల కష్టాలు నేరుగా వినడానికి, వారి సమస్యలు తీర్చడానికి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు.

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

"మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం.

నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం.

గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం.



అమరావతి : ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... మిగతా..2లో

## అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి... వరుస అగ్నిప్రమాదాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- ★ కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాజధానిలో పనులు ఊపందుకున్న తర్వాత జరుగుతున్న వరుస ఘటనలపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు.
- ★ నిర్మాణ సంస్థలు కూడా తమ వంతుగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం




అమరావతి :రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు వేగంగా జరుగుతున్న సమయంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో, ప్రతి నిర్మాణ సంస్థ తమ సామగ్రి నిల్వచేసే యార్డులో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాజధానిలో భద్రతా వైఫల్యాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాజధానిలో పనులు ఊపందుకున్న తర్వాత జరుగుతున్న వరుస ఘటనలపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. రాయపూడి వద్ద హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఓ సంస్థకు చెందిన పైపులు దగ్ధమైన ఘటనపై సచివాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ కుమార్ లడ్హా, గుంటూరు ఎస్పీ వకుళ్ జిందాల్‌తో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

మొదటి పేజి తరువాయి

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం: సీఎం చంద్రబాబు

నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి... వరుస అగ్నిప్రమాదాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

ఈ వరుస ఘటనలు ప్రమాదవశాత్తు జరుగుతున్నాయా, లేక వీటి వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే విషయంపై నిగ్గు తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఘటన జరిగిన తీరు, అంత త్వరగా మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఫోరెన్సిక్ ఆధారాలతో సహా వెలికితీయాలని సూచించారు. సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాజధానిలో పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోట్ల విలువైన సామగ్రిని నిల్వ చేశారు. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఘటనల వల్ల పనులకు అనవసర అడ్డంకులు ఏర్పడతాయి. కాబట్టి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. రాజధాని ప్రాంతంలో అదనపు పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రోన్ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ సంస్థలు కూడా తమ వంతుగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని, వారి రాకపోకలను గమనిస్తూ అవసరమైతే ప్రశ్నించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్టు తేలితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం

ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. అయితే, వర్షం కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ముఖ్యంగా ప్రధాన రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల మేరకు రాబోయే గంటల్లో కూడా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని, వర్షం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

బ్యాంకింగ్ రుణాల కింద రూ.58 వేల కోట్ల మంజూరు చేశామని సీతక్క గుర్తు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, సన్న వడ్లతోపాటు రూ. నాలుగున్నర లక్షల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని తెలిపారు. మీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పని లేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్స్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని ప్రకటించారని చెప్పారు. రూ. 50కే లీటర్ పెట్రోల్ ఇస్తామన్నారని సీతక్క గుర్తు చేశారు. కానీ పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. విభజన హామీలు నెరవేర్చకుండా వట్టిగా ప్రసంగిస్తే ఏం ఉపయోగం అంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా సీతక్క చురకలంటించారు. తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నులు కావాలి కానీ.. ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు మాత్రం పట్టవా అంటూ బీజేపీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. గత ప్రభుత్వ తీరు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సీతక్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో తాము పని చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం మీకే చెల్లిందంటూ బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వరరెడ్డి తీరును ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎండగట్టారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సిగ్గులేకుండా వారి ఖాతాలో వేసుకుంటున్నారు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందన్న డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలోనైనా నిధులు విడుదల చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన గొంతుకలపై ఉక్కుపాదం మోపడం రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని హితవు పలికారు. విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 127 మంది విద్యార్థులు మరణించినా ముఖ్యమంత్రిలో కనీస చలనం లేదని, ఇప్పటివరకు దానిపై స్పందించకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలోనైనా నిలబెట్టుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్వి నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఇరాన్ కొత్త సెక్యూరిటీ చీఫ్‌గా మహమ్మద్ జోల్‌ఘాద్

కువైట్‌పైనా ఇరాన్ దాడులు కొనసాగాయి. ఈ దాడులను అడ్డుకునే క్రమంలో పడిన శకలాల కారణంగా ఏడు ఓవర్‌హెడ్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల కువైట్‌లోని పలు ప్రాంతాల్లో పాక్షికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం అలుముకుంది. ఇవాళ 5 బాలిస్టిక్ మిస్సైళ్లు, 17 డ్రోన్లను అడ్డుకున్నట్లు యూఏఈ తెలిపింది. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సరిహద్దులోని హోర్ముజ్ జలసంధి నుంచి 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే మరో రెండు భారతీయ ఎల్పిజి ట్యాంకర్లు సురక్షితంగా బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి. దేశవ్యాప్తంగా ఒక రోజు వినియోగానికి సరిపడా సుమారు 92వేల 612 టన్నుల వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. లారక్, ఖేష్మ్ ద్వీపాల మీదుగా ప్రయాణించిన ఈ నౌకల్లో ఒకదానిలో 33, మరోదానిలో 22 మంది భారత నావికులు ఉన్నారు. మార్చి 26 నుంచి 28 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. ఇప్పటికే శివాలిక్, నందా దేవి వంటి గ్యాస్ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో దేశ ఇంధన అవసరాలకు కొంత ఊరట లభించనుంది. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తున్నారని ఇజ్రాయెల్‌కు చెందిన సీనియర్ అధికారులు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు తెలిపారు. అయితే ట్రంప్ డిమాండ్లకు ఇరాన్ అంగీకరించకపోవచ్చనే సందేహాన్ని వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం సహా బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలపై పరిమితులను విధించే నిబంధనలకు ఆ దేశం అంగీకరించే అవకాశం లేదని చెప్పారు.

## కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ జాబ్ క్యాలెండర్ ఉంది



ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వాస్తవ ఖాళీలు ఎన్ని, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. దీంతోపాటు, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా - ప్రజాదర్బార్ లో నారా లోకేశ్ హామీ

మొదటి పేజి తరువాయి

మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో 85వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు మంత్రిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విన్న లోకేశ్ పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఆప్యాయ పలకరింపు, అభయప్రదానం : ఉదయం నుంచే టీడీపీ ఆఫీసు దగ్గర సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి సామాన్య ప్రజలు, రైతులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్వయంగా వారి చేతుల మీదుగా అర్జీలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా - 85వ రోజు నారా లోకేశ్ 'ప్రజా దర్బార్'

కేబుల్ ఆపరేటర్ల సమస్యలపై సానుకూల స్పందన : ఈ ప్రజా దర్బార్‌లో ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు మంత్రి లోకేశ్ ను కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను ఆయన దృష్టికి



తీసుకొచ్చారు. ముఖ్యంగా ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి కాలం తీరిన (ఎక్స్‌పైర్ అయిన) సెట్ టాప్ బాక్సులపై వసూలు చేస్తున్న రూ. 59 రెంటల్ ఛార్జీని తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి: ఏలూరుకు చెందిన నిమ్మల జ్యోతి కుమార్ అనే న్యాయవాది మంత్రి లోకేశ్ కు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. విధుల్లో ఉన్న న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించేలా 'అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' (న్యాయవాదుల రక్షణ చట్టం)ను వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల తీరుపై ఫిర్యాదులు : సామాన్య ప్రజలు సైతం తమ భూమి, పన్ను సమస్యలను మంత్రి లోకేశ్ ముందు ఏకరువు పెట్టారు. స్థానిక అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామానికి చెందిన ముత్తే సాంబశివరావు మంత్రిని కలిశారు. తనకు ఆ గ్రామంలో 0.81 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. విజయవాడలోని మొగల్రాజపురానికి చెందిన గూడపాటి కోటేశ్వరరావు తన సమస్యను విన్నవించారు. తనకు అక్కడ ఒక ఖాళీ స్థలం ఉందని తెలిపారు. అయితే, మున్సిపల్ అధికారులు వేరొక వ్యక్తి పేరు మీద అక్రమంగా ఆ స్థలానికి ఇంటి పన్ను వేశారని ఫిర్యాదు చేశారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ అక్రమ పన్నును వెంటనే రద్దు చేసి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి : ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులన్నింటినీ మంత్రి నారా లోకేశ్ జాగ్రత్తగా పరిశీలించారు. ఏ ఒక్క అర్జీ బుట్టదాఖలు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

## విజయవాడకు మూడు గంటల్లో చేరే విధంగా రహదారి నిర్మాణం

మొదటి పేజి తరువాయి

నారాయణ రెడ్డి కోరారు. అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి : శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై ప్రశ్నించారు. అనేక కళాశాలలు ఉన్నాయని, రోడ్డు దాటాలి అంటే ఇబ్బంది పడుతున్నారని, అనేక మంది ప్రమాదానికి గురవుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తుక్కుగూడ నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిని ఆరు లైన్ల రోడ్డుగా విస్తరించాలని కోరారు. శ్రీశైలం జాతీయ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తాండూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుద్దారం, నాగులపల్లి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని విజ్ఞప్తి : పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారని గుర్తు చేశారు. మంజూరు అయితే చేయించారని కానీ పనులు ఎప్పటి వరకు ప్రారంభిస్తారనేది మంత్రి సమాధానం చెప్పాలని అడిగారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతుందని, ప్రభుత్వం చొరవ తీసుకుని మత సంప్రదాయాలకు అనుగుణంగా మరొక్క చోట స్థలాలు కేటాయిస్తే, ట్రాఫిక్ రద్దీ తగ్గించవచ్చని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యం : హైదరాబాద్ జంట నగరాల రోడ్లపైనే సభ్యులు మాట్లాడారని, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు 65 కాలనీలు అక్కడ ఉన్నాయని, దాదాపు 12 లక్షల మంది ఉన్నారని అన్నారు. నాగపూర్ తరహాలో డబుల్ డెక్కర్ రోడ్డు కావాలని నితిన్ గడ్కరీని కోరినట్లు చెప్పారు. డబుల్ డెక్కర్ రోడ్డు ప్రపోజల్స్ పంపడం జరిగిందని మూడు,



నాలుగు నెలల్లో మంజూరు చేయించుకుని, ఆరు నెలల్లో పనులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఏపీలోని విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా 6 లైన్ రోడ్

## ఒకే దేశం, ఒకే చట్టం: గుజరాత్ లో యూనిఫాం సివిల్ కోడ్ !

మొదటి పేజి తరువాయి

"ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు జరిగాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగించేందుకు గుజరాత్ లో యూసీసీ బిల్లును ప్రవేశపెట్టాం. మతాలు వేర్వేరుగా ఉండవచ్చు. కానీ సత్యం ఒక్కటే. న్యాయం ఒక్కటే. స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత, దేశంలో ఏకీకృత చట్టాన్ని తీసుకురావడానికి ఒక ప్రయత్నం జరిగింది. ఈ బిల్లు గుజరాత్ పౌరుల ఆకాంక్షలను, సమగ్రతను అనుసంధానించే ఒక గొప్ప ముందడుగు. వివిధ మతాలకు, వర్గాలకు వేర్వేరు నియమాలు ఉండకూడదు. రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తించినట్లే, ఈ చట్టం కూడా అందరికీ సమానంగా వర్తిస్తుంది."

**- భూపేంద్ర పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి**

గుజరాత్ అసెంబ్లీలో ఈ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై చర్చించి, అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ 'గుజరాత్ యూనిఫాం



సివిల్ కోడ్ , 2026' కనుక ఆమోదం పొందితే, దేశంలో యూసీసీ బిల్లును ఆమోదించిన రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలుస్తుంది. 2024 ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ సర్కార్ మొదటసారిగా ఈ బిల్లును ఆమోదించింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి అమలులో ఉంది.

### మతంతో సంబంధం లేకుండా!


ఉమ్మడి పౌరస్మృతి బిల్లు కనుక ఆమోదం పొందితే, మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవన సంబంధాలు నియంత్రించడానికి ఒక ఉమ్మడి చట్టం అమల్లోకి తీసుకురావచ్చు. మరీ ముఖ్యంగా ఇది సహజీవన సంబంధాలను నమోదు చేసుకోవడానికి, అలాగే అధికారిక ప్రకటన చేసి, వాటిని రద్దు చేసుకోవడానికి వీలుకల్పిస్తుంది. వాస్తవానికి ఈ బిల్లు బహుభార్యత్వాన్ని నిషేధిస్తుంది. వివాహ సమయంలో వధూవరులు ఇద్దరికీ బతికి ఉన్న జీవిత భాగస్వామి లేకపోతేనే, ఆ పెళ్లి చట్టం ప్రకారం చెల్లుబాటు అవుతుంది.

### ఇది ఎవరెవరికి వర్తిస్తుంది?

ఈ ఉమ్మడి పౌరస్మృతి బిల్లు కనుక ఆమోదం పొందితే, అది గుజరాత్ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది. అంతేకాదు రాష్ట్రం వెలుపల నివసించే గుజరాతీలు కూడా దీని పరిధిలోకి వస్తారు. కానీ, ఇది షెడ్యూల్డ్ తెగలకు, రాజ్యాంగం ప్రకారం, సంప్రదాయ హక్కులకు రక్షణ కలిగి ఉన్న కొన్ని సమూహాలకు వర్తించదు.

## మీరు ఎందులో మేధావి?

పరీక్షల్లో మంచి మార్కులు వస్తే కుర్రాడు తెలివైనవాడు, చురుకైనవాడు అనేస్తాం. మన దృష్టిలో తెలివితేటలకు కొలమానం చదువూ ర్యాంకులే. కానీ మేధస్సు చాలా రకాలుగా ఉంటుంది. అందుకే చదువూ డిగ్రీలతో సంబంధం లేకుండా భిన్నరంగాల్లో రాణించేవారిని మనం చూస్తూ ఉంటాం. తన 'థియరీ ఆఫ్ మల్టిపుల్ ఇంటెలిజెన్సెస్'లో ఎనిమిది రకాల మేధస్సులను పేర్కొన్నారు హోవార్డ్ గార్డ్‌నర్. వీటిలో రకరకాల కాంబినేషన్లను మనుషుల్లో గమనించవచ్చంటారీ అమెరికన్ సైకాలజిస్ట్. ఆ ఎనిమిదీ ఏంటో తెలిస్తే వాటిలో మనకు ఏవేవి ఉన్నాయో చూసుకోవచ్చు కదా! లింగ్విస్టిక్ ఇంటెలిజెన్స్: భాషాపరమైన మేధావులన్నమాట. భాషపై మంచి పట్టు ఉండటంతో పద ప్రయోగాలూ సంభాషణా చాతుర్యంలో కట్టిపడేయగలిగిన వీళ్లు రచయితలుగా, కవులూ కథకులుగా, న్యాయవాదులుగా, వక్తలుగా రాణిస్తారు. లాజికల్- మ్యాథమెటికల్ ఇంటెలిజెన్స్: గణితం, తర్కం అంటే అమితంగా ఇష్టపడేవారు ఈ కోవకు చెందుతారు. ప్రతి విషయంలోనూ 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అని ప్రశ్నిస్తూ, సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించగలరు. వాటికి సరైన పరిష్కారాన్ని వెతకడంలో ముందుంటారు. ఇంజినీర్లు, శాస్త్రజ్ఞులు, ఆర్థిక విశ్లేషకులుగా వీరు అద్భుతాలు సృష్టిస్తారు. స్పేషియల్ ఇంటెలిజెన్స్: వస్తువుల్ని, చిత్రాల్ని త్రీడైమెన్షన్స్‌లో చూసి అర్థం చేసుకునే శక్తి వీరి సొంతం. ఏదైనా ఖాళీ స్థలాన్ని చూడగానే అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టవచ్చో ఊహించగలిగే ఆర్కిటెక్టులు, రంగుల కలయికతో ప్రాణం పోసే చిత్రకారులు, శిల్పులు ఈ కోవకే చెందుతారు. వీరికి దిశల పట్ల అవగాహన, బొమ్మలూ మ్యాప్‌ల ద్వారా విషయాన్ని గ్రహించే శక్తి మెండుగా ఉంటుంది. బాడీలీ- కినెస్థెటిక్ ఇంటెలిజెన్స్: శరీర కదలికల ద్వారా అద్భుతమైన భావప్రకటన చేయగలిగిన శక్తి వీరి సొంతం. అథ్లెట్లుగా మైదానంలో ప్రతిభ చూపుతారు. నృత్యకారులుగా వేదిక మీద రాణిస్తారు. సునిశితమైన కళాకారులుగా విభిన్న కళల్లో వీరి ప్రతిభ చూడవచ్చు. మ్యూజికల్ ఇంటెలిజెన్స్: శృతి, లయ, స్వర జ్ఞానంతో పాటు గొంతులను తేలిగ్గా గుర్తుపట్టగల సామర్థ్యం మ్యూజికల్ ఇంటెలిజెన్స్ ఉన్నవాళ్లకు ఎక్కువగా ఉంటుంది. వీళ్లు ప్రతి చిన్న శబ్దాన్నీ వినగలరు, దాని ప్రత్యేకతలను గుర్తించగలరు. సంగీతం, ధ్వనికి సంబంధించిన రంగాల్లో మంచి గుర్తింపు పొందుతారు. ఇంటర్ పర్సనల్ ఇంటెలిజెన్స్: అనుబంధాలూ మానవ సంబంధాల నిర్వహణలో వీరి తర్వాతే ఎవరైనా. అందరినీ కలుపుకొని పోగలరు. ఇతరుల భావాలను, అవసరాలను అర్థం చేసుకోవడంలో సిద్ధహస్తులైన వీరు సైకాలజిస్టులుగా, మేనేజర్లుగా, ఉపాధ్యాయులుగా, రాజకీయ నాయకులుగా మంచి ప్రభావం చూపగలరు. ఇంట్రాపర్సనల్ ఇంటెలిజెన్స్: క్రమశిక్షణ వీరి సొంతం. తమ బలాలూ బలహీనతలను తెలుసుకోవడం, తదనుగుణంగా




లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లడం వీరి లక్షణం. సైకాలజీ, రచన, వ్యాపారం, ఫిలాసఫీ, రీసెర్చ్.. ఇలాంటి భిన్న రంగాల్లో రాణించగలరు. నేచురలిస్టిక్ ఇంటెలిజెన్స్: వీళ్లకు ప్రకృతిని అద్భుతంగా అర్థం చేసుకోగల శక్తి ఉంటుంది. రైతులుగా, ప్రకృతి ప్రియులుగా, పర్యావరణవేత్తలుగా కనిపిస్తారు.

## హర్మ్యూజ్ దాటిన రెండు భారత ఎల్ పీజీ నౌకలు మరో ఆరు రెడీగా ఉన్నాయన్న కేంద్రం

మొదటి పేజి తరువాయి

హర్మ్యూజ్ జలసంధిని దాటేటప్పుడు టోల్ లేదా సుంకం విధించే అంశంపైనా నౌకా రవాణా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ సిన్హా స్పందించారు. "ఇది ఒక అంతర్జాతీయ జలసంధి, అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం దీనికి స్వేచ్ఛా నౌకాయాన హక్కు ఉంది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం దీనిపై ఎటువంటి సుంకం విధించరాదు. అందువల్ల ఎవరైనా చెప్పే ఏ వాస్తవానికైనా, చేసే ఏ వాదనకైనా ఎటువంటి ఆధారం లేదు. ఇది ఒక నిరాధారమైన వాదన. ఐదు ఎల్పీజీ ట్యాంకర్లు సరకుతో నిండి ఉన్నాయి. ఒక ఎల్పీజీ ట్యాంకర్ ఖాళీగా ఉంది. కానీ ఇప్పుడు అది డ్రై డాక్ నుంచి బయటకు వచ్చింది. రాబోయే మూడు నాలుగు రోజుల్లో దానిని కూడా సరుకుతో నింపుతారు. కాబట్టి మొత్తం మీద మనకు ఆరు ఎల్పీజీతో నిండిన క్యారియర్లు ఉంటాయి." అని తెలిపారు. "హర్మ్యూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదు. ఇది ఒక అంతర్జాతీయ జలసంధి. గతంలోనూ అనుమతి అవసరం ఉండేది కాదు. నేటికీ ఎవరీ అనుమతి అవసరం లేదు. భద్రతా పరిస్థితులు ఎలా ఉంటాయి, ఎలా ముందుకు సాగాలి, ఏ సమయంలో ప్రయాణించాలి అనే విషయాలను అంచనా వేయడం తప్పా మరెవరి నుంచీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం మాత్రం ఏమాత్రం లేదు"



రాజేష్ సిన్హా, నౌకా రవాణా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి

మరో ఆరు ఎల్పీజీ నౌకలు సిద్ధంగా ఉన్నాయి : కేంద్రం

మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరడంతో ఎల్పీజీ కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచి ఉన్న మరికొన్ని ట్యాంకర్లను హర్మ్యూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చిస్తోంది. ఈ చర్చలు సఫలం అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. ఫలితంగా 3,00,000 టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకోవడం ఆలస్యం అవుతోంది. కాగా, తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హర్మ్యూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించింది. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హర్మ్యూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.

విజేత
బుధవారం-25-మార్చి-2026

## లోకదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సై అరవింద్ కుమార్



**అక్షరవిజేత, టేక్మాల్ :** ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ ఆధాలాత్ ను సద్వినియోగం చేసుకోవాలని టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్లో రాజీ కాదగిన కేసులను కక్షిదారులు, అర్జీదారులు ఇరువురు రాజీ అయితే తొలగించుకోవచ్చు అన్నారు. దీంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఈ-పెట్టి కేసులు తక్కువ జరిమానాతో తొలగించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమాన్ని తేదీ 24-28 వరకు అల్లాదుర్గం కోర్టులో నిర్వహించడం జరుగుతుందని, ఈ సదాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పోలీస్ స్టేషన్ 8712657885, 8712657918 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## అక్రమ అరెస్ట్ లను ఖండిస్తున్నాం



**విజేత కృష్ణ :** మక్తల్ మండలంలో బి ఆర్ ఎస్ బిఆర్ఎస్వి యువ నాయకులను పోలీస్ లు అక్రమ అరెస్ట్ ను ఖండించిన మక్తల్ బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు జె.చిన్నహన్మంతు వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 దొంగ హామీలను నిరవేర్చకుండా పెండింగులో ఉన్న పీజ్ రియంబర్స్మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు తీరును ఖండించారు ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సర్ ఎండీ అన్వర్ హుసేన్,ఎండీ మన్నన్, ఎండీ మైమూద్ తదితరులు పాల్గొన్నారు

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి:ఎస్సై



**విజేత,రాయికోడ్ :** ఈనెల 28వ తేదీన అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జరిగే జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ లోక్ అదాలత్ ద్వారా ట్రాఫిక్ చలన్లు, భూ వివాదాలు,వాహన ప్రమాద పరిహార కేసులు,చిట్ ఫండ్ కేసులు,వైవాహిక కేసులు,ఆస్తి తగాదాలు, అలాగే అన్ని రకాల రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులు ఇరువర్గాల కక్షిదారులు అంగీకార యోగ్యమైన సత్వర పరిష్కారం పొందవచ్చు కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు రక్షకభట నిలయంలో సంప్రదించాలని సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల సబ్ ఇన్స్పెక్టర్ చైతన్య కిరణ్ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు.

## అంగన్వాడీ లో ఇచ్చే ఆహార పదార్థాలను బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలి..

సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి..



**విజేత:మొగుళ్ళపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామం లో 1ఆ2ఆ3అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆళ్ల ముత్యం రెడ్డి . ముఖ్య అతిథులుగా పాల్గొని మంగళవారం రోజున ఆరోగ్యలక్ష్మి కమిటీ మెంబర్స్ ని ఎన్నుకొని మీటింగు నిర్వహించడం జరిగింది. ఆరోగ్య లక్ష్మి మీటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యముఅంగన్వాడీ కేంద్రంలో జరిగే సేవలు గూర్చి మరియు ఆహార పదార్థాల పంపిణీ, అనుబంధ పోషకాహారం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, ఆరోగ్య సేవలు మరియు గర్భిణీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల కిశోర బాలికలకు చిక్కి ప్యాకెట్స్ , ఇమినైజేషన్ ,పూర్వ ప్రాథమిక విద్య ,విషయాల గూర్చి చర్చించుకోవడం జరిగింది. సర్పంచ్ ఉప సర్పంచ్ ఆరు నెలల పాపకిఅన్నప్రాసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కమిటీకి చైర్మన్ గా సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి . కన్వీనర్ గా అంగన్వాడి టీచర్ ఉంటారు. మొత్తం 11 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి గర్భిణీలు ,బాలింతలు ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులు, మూడు నుండి ఆరు సంవత్సరముల పిల్లల తల్లులు ,కిశోర బాలికలు,,అంగన్వాడి టీచర్స్ వాణి, రమాదేవి, రాధిక ,ఆశా వర్కర్ తల్లులు పాల్గొన్నారు

## అంగడి వేలాన్ని దక్కించుకున్న మహ్మద్ వసీం



**విజేత మరిపెడ:-** మరిపెడ మున్సిపాలిటీ పట్టణ అంగడి ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత వేలం పాట మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయనంద్, మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 2026-27 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ వేలంలో పలువురు పోటాపోటీగా పాల్గొన్నారు. చివరకు మరిపెడ గ్రామానికి చెందిన మహ్మద్ వసిం రూ.28 లక్షల 93,000/- రూ లకు ఈ వేలం దక్కించుకున్నారు. ఈ వేలం కాలపరిమితి 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు జాటోతు సురేష్,మెరుగు రాము గంట్ల గౌతమ్ రెడ్డి బోడ భాస్కర్ జియో రమేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్ష్యుడు షేక్ తాజుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఖలీల్,అలువాల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి భిక్షపతి,షేక్ ఖాదర్,కుడితి నర్సింహా రెడ్డి గుండగాని వెంకన్న బాషిపంగు రవికాంత్ గంధసిరి కృష్ణమూర్తి లచ్చిరాం కరణ్ సింగ్ చెన్నూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ ల లో జరిగే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..

సర్పంచ్ ఆరెల్లి రమేష్..



**విజేత:మొగుళ్ళపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం వేములపల్లి గ్రామం లొ 1ఆ2ఆ3ఆ4అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో సర్పంచ్ ఆరెళ్ళ రమేష్, ఉప సర్పంచ్ కొత్తూరు శంకర్, ముఖ్య అతిథులుగా పాల్గొనిఆరోగ్యలక్ష్మి కమిటీ మెంబర్స్ ని ఎన్నుకొని మీటింగు నిర్వహించడం జరిగింది. ఆరోగ్య లక్ష్మి మీటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యముఅంగన్వాడీ కేంద్రంలో జరిగే సేవలు గూర్చి మరియు ఆహార పదార్థాల పంపిణీ, అనుబంధ పోషకాహారం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, ఆరోగ్య సేవలు మరియు గర్భిణీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు కిశోర బాలికలకు చిక్కి ప్యాకెట్స్ , ఇమినైజేషన్ ,పూర్వ ప్రాథమిక విద్య ,విషయాల గూర్చి చర్చించుకోవడం జరిగింది. సర్పంచ్ ఉప సర్పంచ్ గుత్తికొండ సాన్విత లకు సీమంతం. ఆరు నెలల పాపకిఅన్నప్రాసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కమిటీకి చైర్మన్గా సర్పంచ్ ఆరెళ్ళ రమేష్ . కన్వీనర్ గా అంగన్వాడి టీచర్ ఉంటారు. మొత్తం 11 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి గర్భిణీలు ,బాలింతలు ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులు, మూడు నుండి ఆరు సంవత్సరముల పిల్లల తల్లులు ,కిశోర బాలికలు,, ఏఎన్ఎం ,అంగన్వాడి టీచర్స్ స్వరూప రాణి ,జ్యోతి ,అనిత ,సబిత,ఆశా వర్కర్ ,ఆయాలు,తల్లులు పాల్గొన్నారు.

## తాడిచెట్టు ఎక్కుతూ మోకుజారి కింద పడ్డ గీతా కార్మికుడు తీవ్ర గాయాలు..



**విజేత:మొగుళ్ళపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామనికి చెందిన ఎర్ర తిరుపతి వయస్సు, (40) గీత కార్మికుడు కుల వృత్తిలో భాగంగా రోజు లాగానే సోమవారం రోజున తాటి చెట్లు ఎక్కేందుకు వెళ్లాడు, తాటి చెట్టు ఎక్కుతు దిగుతున్న క్రమంలో మోకుజారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి వెంటనే తిరుపతిని హుటాహుటిన చిట్యాల ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు. నిరుపేద తిరుపతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం గ్రామ అధ్యక్షులు మండ కుమార్, ఉపాధ్యక్షులు బండి కుమార స్వామి, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## సమయ పాలన పాటించని ఎంపీడీఓ...







**విజేత:సంగెం :** గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించాల్సిన సంగెం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ ) సమయ పాలన పాటించకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యాలయానికి తరచూ ఆలస్యంగా రావడం, ప్రజల సమస్యలను వినడంలో నిర్లక్ష్యం చూపడం వంటి అంశాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యాలయం అనేక సార్లు ఆలస్యంగా తెరుచుకుంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పింఛన్లు, రేషన్, ఉపాధి హామీ పథకాల వంటి సేవల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని తెలిపారు. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు కూడా ఎంపీడీఓ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని, ఫైళ్ల క్లియరెన్స్లో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని, సమయ పాలన పాటించేలా కట్టుదిట్టమైన చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు.

## కులమతాలకు అతీతంగా రేణుక ఎల్లమ్మతల్లి కి విరాళాల అందజేత







**విజేత,రాయికోడ్ :** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ శివారులో వెలసిన రేణుకఎల్లమ్మ తల్లి మందిర నిర్మాణానికి గ్రామస్తులు ఇంటింటికి తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు,ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యేసప్ప 1,51,000 వేల రూపాయలు,మాజీ ఎంపీపీ సిర్గపురం మొగులప్ప 1,16,000 రూపాయలు, నడిమిదొడ్డి శాంసన్,శశిధర్ పటేల్,మోట్లకుంట సంగమేష్,విఠల్ రావు కులకర్ణి,మంగ అశోక్ పాటిల్, మాజీ సర్పంచ్ కేదారినాథ్ పాటిల్,బిరాద్దార్ సంగమేశ్వర్ తల 51,000 రూపాయలు మరియు ప్రతి ఇంటి నుండి తమకు తోచినంత చందా ఇచ్చారు, ప్రతిఒక్కరు కూడా మందిర నిర్మాణానికి ధన రూపేణా,వస్తూ రూపేణా తమకు తోచిన రీతిలో సహాయం చేయాలని కోరారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్...



**విజేత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రాజారం గ్రామపంచాయతీలోని గ్రామ అభివృద్ధి పనుల్లో భాగంగా చిలకమారి గూడెం గ్రామం ఓరగంటి వాడలో సిసి రోడ్డు పనులను సర్పంచ్ పూదరి లక్ష్మి పురుషోత్తం, ఉప సర్పంచ్ ఎరువోతుల శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి నాణ్యమైన రోడ్ల నిర్మాణంతో గ్రామ రూపురేఖలు మారుతాయని, ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, రోడ్ల నిర్మాణంతో అభివృద్ధికి పునాదులు పడతాయని, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్టు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామంలోని ప్రతి వీధిలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు మెరుగు పరుస్తామని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టిన సర్పంచ్ పూదరి లక్ష్మి పురుషోత్తం కి గ్రామ,వాడ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఓరగంటి గణేష్, ఎరువోతుల నాగేష్, ఓరగంటి మల్లేష్, పూదరి శంకర్ మరియు వాడ సభ్యులు పాల్గొన్నారు.

## భూసమస్యలను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలి

సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

ఇబ్రహీంపట్నం సిపిఐ నాయకులు.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు తక్షణమే ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో ఇబ్రహీంపట్నం సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పేదల నివాస హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. సంవత్సరాలుగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం తీవ్రంగా ఖండించారు. వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, భూసమస్యలను పరిష్కరించి పేదలకు న్యాయం చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన సిపిఐ నాయకులు, కావలి నర్సింహా ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్, మంచాల మండల కార్యదర్శి బండికంటి బాలయ్య, మండల నాయకులు శివరాల యాదయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ ఎస్ఐకిశ్రీ పట్టాభి సీతారాముల కళ్యాణ ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ కమిటీ



**విజేత ,గణపురం :** గణపురం మండల కేంద్రంలో జరగబోయే శ్రీ పట్టాభి సీతారాముల కల్యాణానికి ఆహ్వాన పత్రికను గణపురం సిఐ,ఎస్ఐ అందించిన ఆలయ కమిటీసభ్యులు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ బండారి శంకర్,మాదాసు అర్జున్, మూల శ్రీనివాస్, బటిక స్వామి, బూర రాజగోపాల్, మాదాసు మొగిలి, రామస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరు శ్రీనివాస్,మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ,ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, వార్డ్ మెంబర్ ఓధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి నాణ్యత పై అవగాహన సదస్సు



**విజేత మెంటాడ :** మండలంలో ఉన్న పంచాయతీలలో గల గ్రామాలలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు మరియు బోరు బావులలో నీటి నాణ్యత పై సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆర్ డబ్ల్యు ఎస్, ఏఈ ఏ. నవీన్ మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలోఎంపీడీవో సుదర్శన్ ఆధ్వర్యంలోఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం కుళాయిల ద్వారా మరియు బోరుబావుల ద్వారా ప్రజలకు అందే త్రాగునీరు వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా త్రాగనీటి నాణ్యతను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని అందించాలని అన్నారు. వేసవి కాలం కావడంతో త్రాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి సుదర్శన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా సంఘర్షణ: విస్తరిస్తున్న యుద్ధం, మారుతున్న సమీకరణాలు



ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన నాటి నుంచి పశ్చిమాసియా అగ్నిపర్వతంగా మారింది. నాలుగో వారంలోకి అడుగుపెట్టిన ఈ సంఘర్షణ ఇప్పుడు హిందూ మహాసముద్రం వరకు విస్తరించి, ప్రపంచ శక్తి భద్రత, వాణిజ్య మార్గాలు, అంతర్జాతీయ దౌత్యం అన్నింటినీ కలచివేస్తోంది. ప్రారంభంలో ఇరాన్ మాత్రమే లక్ష్యంగా భావించిన ఈ యుద్ధం ఇప్పుడు ప్రాంతీయ దేశాలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్న దుస్థితికి చేరుకుంది.

**డియాగో గార్సియాపై క్షిపణి ప్రయోగం:కొత్త దశ:**

గత వారం ఇరాన్ ప్రయోగించిన రెండు బాలిస్టిక్ క్షిపణులు హిందూ మహాసముద్రంలోని డియాగో గార్సియా సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఈ సంఘర్షణలో నాటకీయ మలుపు. ఇరాన్ సరిహద్దు నుంచి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్థావరం అమెరికా-బ్రిటన్లకు సంయుక్తంగా ఉన్న అత్యంత వ్యూహాత్మక కేంద్రం. ఒక క్షిపణి మార్గమధ్యలో విఫలం కాగా, రెండోదాన్ని అమెరికా యుద్ధనౌక ఎస్ఎమ్-3 ఇంటర్సెప్టర్ తో కూల్చివేసినట్లు బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హీలీ ధృవీకరించారు. ఈ దాడి యొక్క ప్రాధాన్యత ఏమిటంటే, ఇరాన్ తన క్షిపణి పరిధి గురించి ఇప్పటివరకు ప్రపంచానికి తెలిసిన అవగాహనను పూర్తిగా మార్చివేసింది. ఇరాన్ ఇంతకుముందు తన క్షిపణుల పరిధిని 2,000 కిలోమీటర్లకే పరిమితం చేసుకున్నట్లు ప్రకటించుకుంది. అయితే ఈ ప్రయోగం ద్వారా 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేధించగల సామర్థ్యం ఇరాన్ కు ఉందని స్పష్టమైంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఈ ప్రయోగాన్ని "రెండు-దశల బాలిస్టిక్ క్షిపణి"గా అభివర్ణించారు. ఇరాన్ అంతరిక్ష కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన 'ఖయిమ్-100' రాకెట్ నుంచి ఈ సాంకేతికతను స్వీకరించి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది నిజమైతే, ఇరాన్ తన అంతరిక్ష ప్రయోగాలను సైనిక సామర్థ్యంగా మార్చుకోగలదని, అది పశ్చిమ యూరోపియన్ దేశాలకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని భావించాలి. బెర్లిన్, రోమ్, వియన్నా, లండన్ వంటి నగరాలు ఇప్పుడు ఇరాన్ క్షిపణుల పరిధిలోకి వచ్చాయన్నది ఈ ప్రయోగం ద్వారా వెల్లడైన అతిపెద్ద వాస్తవం.

**డియాగో గార్సియాపై దాడి విషయంలో: ఎవరి మాట నిజం?**

ఈ దాడికి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఇరాన్ దీనిని ఖండించడం. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయ్ ఈ ఆరోపణలను "తప్పుడు సమాచారం"గా కొట్టిపారేశారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా ఈ ఆరోపణలను ధృవీకరించలేదని, ఇజ్రాయెల్ ప్రచారంలో భాగంగా ఇది ఉండవచ్చని ఆయన సూచించారు. అయితే బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హీలీ మాత్రం ఈ దాడి జరిగిందని, ఒక క్షిపణి విఫలమైందని, రెండోదాన్ని కూల్చివేశామని స్పష్టంగా ప్రకటించారు. అమెరికా పెంటగాన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. ఈ విరుద్ధ ప్రకటనలు ఈ ఘటన చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతున్నాయి. ఈ దాడికి ముందు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అమెరికా బాంబర్లు డియాగో గార్సియా నుంచి ఇరాన్ పై దాడులు చేయడానికి అనుమతించారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ బ్రిటన్ చర్యలు తమపై దురాక్రమణకు సమానమని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికకు కొద్ది గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం.

**ఖార్గ్ ద్వీపం- చమురు యుద్ధం యొక్క కేంద్రం:**

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ చమురు ఎగుమతులకు కేంద్రమైన ఖార్గ్ ద్వీపం అమెరికా దాడుల లక్ష్యంగా మారింది. మార్చి 14న అమెరికా ఈ ద్వీపంలోని 90కి పైగా సైనిక స్థాపనలపై దాడులు చేసింది. అయితే చమురు మౌలిక సదుపాయాలను ఇంకా లక్ష్యంగా చేసుకోలేదు. ఖార్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90 శాతానికి పైగా నిర్వహిస్తుంది. ఇక్కడ సుమారు 3 కోట్ల బ్యారెళ్ల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఇరాన్ రోజుకు 15-16 లక్షల బ్యారెళ్ల చమురు ఎగుమతి చేస్తోంది. ఈ ఎగుమతుల్లో ఎక్కువ భాగం చైనాకు వెళ్తోంది. ఈ ద్వీపంలోని మౌలిక సదుపాయాలు దెబ్బతిస్తే, ప్రపంచ చమురు మార్కెట్లో రోజుకు 20 లక్షల బ్యారెళ్ల వరకు సరఫరా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ఆలోచన కూడా చేస్తోందని వార్తలు వస్తున్నాయి. ఇందుకోసం వేలాది మెరైన్లను ఈ ప్రాంతానికి తరలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇరాన్ ప్రతిగా పర్షియన్ గల్ఫ్ లో దిడులు చేస్తామని హెచ్చరించింది, ఇది అమెరికా దాడిని క్లిష్టతరం చేయడంతోపాటు అంతర్జాతీయ షిప్పింగ్ కు తీవ్ర ముప్పుగా మారుతుంది.

**హోర్ముజ్ జలసంధి: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూలం:**

ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం రవాణా అయ్యే హోర్ముజ్ జలసంధి ఇప్పుడు యుద్ధం యొక్క కేంద్ర బిందువుగా మారింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ ఈ జలసంధి గుండా అమెరికా, ఇజ్రాయెల్ మిత్రదేశాల నౌకల రాకపోకలను అడ్డుకుంటోంది. అయితే భారత్, చైనా వంటి దేశాల నౌకలకు మాత్రం అనుమతిస్తోంది. ఈ నేపథ్యంలో ముడి చమురు ధరలు బ్యారెల్ కు 100 డాలర్లు దాటాయి. బ్రెంట్ క్రూడ్ ధర మార్చి 19న 108.65 డాలర్లకు చేరుకుంది. అయితే ట్రంప్ ఇరాన్ తో చర్చలు జరుపుతున్నట్లు ప్రకటించిన వెంటనే ధరలు కొద్దిగా తగ్గాయి, కానీ ఇరాన్ దానిని తిరస్కరించడంతో మళ్లీ పెరిగాయి. ఈ జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడుతుంది. అందుకే అమెరికా ఇప్పటికీ ఇరాన్ చమురు ఎగుమతులను పూర్తిగా నిలిపివేయడం లేదు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ 2.4 కోట్ల బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసుకుంది, దీని ద్వారా రోజుకు 14 కోట్ల డాలర్ల ఆదాయాన్ని సంపాదిస్తోంది.

**ప్రాంతీయ దేశాల వైఖరి: భారత్ కు సవాళ్లు:**

ఈ సంఘర్షణలో యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్ వంటి గల్ఫ్ దేశాలు అమెరికా వైపు నిలిచాయి. ఇరాన్ నుంచి తమకు ముప్పు పూర్తిగా తొలగించుకోవాలని, అందుకోసం యుద్ధం కొనసాగించాలని ఈ దేశాలు అమెరికాను కోరుతున్నాయి. ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా నశించిన తర్వాతే కాల్పుల విరమణకు సిద్ధపడాలని వారి వాదన. భారత్ మాత్రం సమతూలిత వైఖరి అవలంబిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్తో మాట్లాడి, ప్రాంతీయ స్థిరత్వం కోసం తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో చర్చలు జరిపి, ప్రాంతీయ స్థిరత్వం, సముద్ర మార్గాల భద్రతపై దృష్టి పెట్టారు. భారత్ కు ఇది అత్యంత సున్నితమైన సమయం. ఒకవైపు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, మరోవైపు ఇరాన్తో సాంప్రదాయ సంబంధాలు. హోర్ముజ్ జలసంధి గుండా భారత వాణిజ్యం, శక్తి భద్రత కూడా ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ దౌత్యపరంగా సమతుల్యతను కాపాడుకుంటూ, స్వదేశీ ప్రయోజనాలను కాపాడుకోవడం ఎంతో కీలకం.

**ఇంతకు ట్రంప్ దౌత్యం: చర్చలా? ప్రచారమా?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఇరాన్ తో చర్చలు జరుగుతున్నాయని, యుద్ధాన్ని ముగించేందుకు దాదాపు అన్ని అంశాలపై ఒప్పందం దగ్గరకు వచ్చామని ప్రకటించడం సంచలనంగా మారింది. ఇరాన్ శక్తి కేంద్రాలపై దాడి చేస్తామన్న తమ హెచ్చరికను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు. అయితే ఇరాన్ ఈ ప్రకటనలను పూర్తిగా తిరస్కరించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ ఎటువంటి చర్చలు జరగలేదని, ఇవన్నీ ఆర్థిక మార్కెట్లను మార్చడానికి చేసే తప్పుడు ప్రచారమని ఖండించారు. రివల్యూషనరీ గార్డ్స్ కూడా ట్రంప్ వ్యాఖ్యలను "మానసిక యుద్ధం"గా అభివర్ణించాయి. ఈ విరుద్ధ ప్రకటనలు ఇరాన్-అమెరికా సంబంధాల్లో ఉన్న అపనమ్మకాన్ని మరోసారి హైలైట్ చేశాయి. గతంలో కూడా ఇరాన్ అణు కేంద్రాలపై దాడి జరగడానికి ముందు చర్చలు జరుగుతున్నాయన్న ప్రచారం జరిగింది, అది ఇప్పుడు మళ్లీ పునరావృతమవుతోంది. ఇరాన్ ఈసారి అప్రమత్తంగా స్పందిస్తోంది.

**భవిష్యత్తులో: ఏమి జరగనుందో ?**

పశ్చిమాసియాలో ఈ సంఘర్షణ ఇంకా ఎంతకాలం కొనసాగుతుందనేది ఎవరికీ తెలియదు. నాలుగు వారాలు దాటినా యుద్ధం తీవ్రత తగ్గడం లేదు. ఇరాన్ తన సుదూర క్షిపణి సామర్థ్యాన్ని ప్రదర్శించడం, ఖార్గ్ ద్వీపంపై అమెరికా దృష్టి పెట్టడం, గల్ఫ్ దేశాలు యుద్ధాన్ని కొనసాగించాలని కోరడం ఇవన్నీ ఈ సంఘర్షణ ఇంకా చాలా కాలం కొనసాగే అవకాశాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే చమురు ధరల పెరుగుదలను ఎదుర్కొంటోంది. హోర్ముజ్ జలసంధి పూర్తిగా మూసుకుపోతే, ప్రపంచ సరఫరా గొలుసులు తీవ్రంగా దెబ్బతింటాయి. భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది పెద్ద సవాలుగా మారుతుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఎలాంటి మధ్యవర్తిత్వం చేపడుతుందనేది కీలకం. ఇప్పటివరకు పాకిస్థాన్, ఒమన్, ఈజిప్ట్ వంటి దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఇరాన్-అమెరికా మధ్య ఉన్న అపనమ్మకం ఏ ఒప్పందాన్నైనా అతిక్లిష్టంగా మారుస్తోంది. పశ్చిమాసియా యుద్ధం ఇప్పుడు కేవలం ఒక ప్రాంతీయ సంఘర్షణగా మాత్రమే కాకుండా, ప్రపంచ శక్తి భద్రత, సముద్ర మార్గాల నియంత్రణ, అంతర్జాతీయ దౌత్యం అన్నింటినీ కలిపే పెద్ద సమస్యగా మారుతోంది. ఇకపై ఇది ఎలా పరిణమిస్తుందనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.9849328496.

# కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలి

## ఏఐఎస్ఎఫ్ కేయూ కౌన్సిల్ డిమాండ్

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం





**విజేత,హనుమకొండ :** రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ముఖ్యంగా కాకతీయ యూనివర్సిటీ వంటి ప్రాచీన భావ సంఘర్షణ కేంద్ర అయినటువంటి ప్రభుత్వ విద్యాసంస్థ నిర్లక్ష్యంతో అభివృద్ధి లేక వెనుకబడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, కేయూ కార్యదర్శి బొజ్జ జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం కేవలం నలభై కోట్ల రూపాయలు కేటాయించడం పూర్తిగా తగినది కాదని, కనీసం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సిపతి వినయ్, యూనివర్సిటీ కార్యదర్శి బొజ్జ జ్యోతి మాట్లాడుతూ విద్యా రంగం దేశ భవిష్యత్తును నిర్మించే కీలక విభాగమని, అలాంటి రంగానికి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 30 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యకు సరైన ప్రాధాన్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీల్లో అనేక టీచింగ్ మరియు నాన్-టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, యూనివర్సిటీలో ప్రజాస్వామ్య వాతావరణం పునరుద్ధరించడానికి విద్యార్థి సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమస్యలపై ప్రభుత్వ దృష్టిని పెట్టకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనివర్సిటీలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే సమాజంలో సమానత్వం, న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఉన్నత విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించి, యూనివర్సిటీల అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జక్కుల భాను ప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ ప్రెసిడెంట్ కొమ్ము సాయి, వైస్ ప్రెసిడెంట్ బండి లావణ్య, సహాయ కార్యదర్శి చిప్పలపల్లి వంశీ కుమార్ కాకతీయ యూనివర్సిటీ నాయకులు శరత్, నవీన్, భరత్, సాయికృష్ణ, నాగరాజు, నీరజ, మరియు సాయి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాయే లక్ష్యం



## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## సంగారెడ్డిలో అవగాహన ర్యాలీతో 100 రోజుల 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ వి 2.0' ప్రారంభం







**విజేత,సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి టీబీ రహిత తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపు నిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి సబ్ సెంటర్ వద్ద మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రావీణ్య జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించడంతో పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 100 రోజుల 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ వి2.0' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా దీన్ని నిర్మూలించడం సాధ్యమని తెలిపారు. "టీబీ ముక్త్ భారత్" లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. జిల్లాలో మే 15 వరకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టీబీ అధికంగా ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి, ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో ఇంటింటికీ సర్వేలు నిర్వహించి 14 సంవత్సరాల పైబడిన వారితో పాటు గర్భిణీలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికతతో కూడిన మొబైల్ ఎక్స్-రే యంత్రాల ద్వారా వెంటనే ఫలితాలు అందజేసి, అవసరమైన వారికి తక్షణమే చికిత్స, ఉచిత మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయకుండా పూర్తి స్థాయి చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని టీబీ నివారణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వసంత్ రావు, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ అరుణకుమారి, వైద్య సిబ్బంది, కళాశాలల విద్యార్థులు, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి నాణ్యత పై అవగాహన సదస్సు



**విజేత మెంటాడ :** మండలంలో ఉన్న పంచాయతీలలో గల గ్రామాలలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు మరియు బోరు బావులలో నీటి నాణ్యత పై సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆర్ డబ్ల్యు ఎస్, ఏఈ ఏ. నవీన్ మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలోఎంపీడీవో సుదర్శన్ ఆధ్వర్యంలోఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం కుళాయిల ద్వారా మరియు బోరుబావుల ద్వారా ప్రజలకు అందే త్రాగునీరు వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా త్రాగునీటి నాణ్యతను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని అందించాలని అన్నారు. వేసవి కాలం కావడంతో త్రాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి సుదర్శన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల గడువును పెంచాలి

## ఎంపీడీవోకువినతిపత్రం అందించిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు



**విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తిక్క సంపత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఎస్సీ కులస్తులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు గడువు ఈనెల 24 వరకు చివరి గడువు ఉన్నందున దానికి సంబంధించి ఎస్సీ కులస్తులు అర్హులైన వారు కులం ఆదాయం సర్టిఫికెట్లు తప్పనిసరి కాబట్టి రెవెన్యూ కార్యాలయం నుండి సర్టిఫికెట్లు అందక రాష్ట్ర ,జిల్లా, మండల వ్యాప్తంగా ఎక్కువ మందికి ఆదాయ సర్టిఫికెట్లు సమయానికి అందడం లేదని,అలాగే ఎస్సీ కులానికి చెందినవారు ఎక్కువ మంది ఉన్నందున అదనంగా యూనిట్లు పెంచాలని,దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 24 వరకు ఉన్నందున దానిని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు పొడిగించి అర్హులైనఎస్సీ కులస్తులఅందరికీ అలాగే అదనంగాయూనిట్లుపెంచి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని గణపురం మండల ఎంపీడీవో ఎల్ భాస్కర్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు.

# ప్రగతి ప్రణాళిలో ఉచిత మెగా వైద్య శిబిరం





**విజేత,వెంకటాపురం/నూగురు :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏదిరా వెంకటాపురం మండలం ఆర్బిఎస్కె ఏటీం వైద్యాధికారి ప్రత్యక్ష ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యులతో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల చిరుతపల్లి వన్ చిరుతపల్లి టు. కేజీబీవీ మరియు లక్ష్మీ నగరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నందు వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ప్రత్యేక వైద్య నిపుణులచే విద్యార్థి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. నాలుగు వసతిగృహాలలో పరీక్షించుకున్న విద్యార్థులు 771 రిఫరల్ 131 చిన్నపిల్లల వైద్య నిపుణులు రవితేజ,దంత వైద్య నిపుణులు సుజిత్ ,కంటి వైద్య నిపుణులు,ప్రవీణ్ రెడ్డి సాధారణ వైద్య నిపుణులు వినోద్ కుమార్ ఎండి పవన్ ఎండి ,మనోజులాల్ ఎండి,ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వార్డెన్ ఏఎన్ఎం వారి సిబ్బంది పాల్గొన్నారు. ఏదిరా వైద్యాధికారి భాస్కర్ ,హెచ్ఈఓ కోటిరెడ్డి హెల్త్ అసిస్టెంట్, రాఘవులు, రాజేష్ ఏఎన్ఎం ఆదిలక్ష్మి,రోజా రాణి,సుశీల, సరూప,సరస్వతి, ఆశా కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ డైరెక్టర్ ఎండి జానీ భాష ముందస్తు అరెస్టు




**విజేత, ఇబ్రహీంపట్నం :-** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యండి.జానీ పాషను మంగళవారం ఉదయం మంచాల పోలీసులు అరెస్టు చేసి మంచాల పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేసిన డాక్టర్ వరకల పరమేష్



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తినే ప్లేట్లు పిఆర్టియూ ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ వరకల పరమేష్ సొంత నిధులతో ఉచితంగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రభుత్వం చేపడుతున్న మధ్యాహ్న భోజన పథకం ఎంతో ముఖ్యమైనది. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందించడమే కాకుండా, వారి చదువుపై ఆసక్తిని కూడా పెంపొందిస్తుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు భోజనం తినేందుకునూతన ప్లేట్లు అందజేయడం ఒక మంచి కార్యక్రమమని తెలిపారు. ప్లేట్లు అందజేయడం ద్వారా పిల్లలు పరిశుభ్రతకు అలవాటు పడతారు. ఇది పిల్లలలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుతుంది. అలాగే, ఈ కార్యక్రమం ద్వారా సమానత్వ భావన కూడా పెరుగుతుంది, ఎందుకంటే అందరికీ సమానంగా అవసరమైన వస్తువులు అందుతాయి. మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు అందజేయడం ఒక చిన్న చర్య అయినప్పటికీ, అది విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత సామాజిక విలువలను పెంపొందించే గొప్ప కార్యక్రమంగా నిలుస్తుందని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్య నాయక్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్ ఉపాధ్యాయ మిత్రులు రమేష్, రామేశ్వర్, గోవర్ధన్, రవీందర్ పాల్గొన్నారు.

## జనసేన పార్టీ లెజిస్లేటివ్ సమావేశంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు





**విజేత జీలుగుమిల్లి :** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ లెజిస్లేటివ్ సమావేశంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, సంక్షేమ పథకాల సమర్ధవంతమైన అమలు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పార్టీ శాసనసభ్యులకు ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచుకుని, వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ హామీలను నెరవేర్చడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ ప్రజలకు మరింత సేవ చేయడానికి కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు.

## ప్రభాకర్ ఉగాది పంచాంగ పఠనం




**విజేత మరిపెడ :** మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తెలుగు పండితులు రాచకొండ ప్రభాకర్ బ్రాహ్మణ వేషధారణలో వినూత్నంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండల కేంద్రంలో ఉగాది పంచాంగ పఠనం చేయడం జరిగింది శ్రీ స్వస్తిశ్రీ పరాభావనామ సంవత్సరములో ఏ రాశి కి చెందినవారైన గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు అయితే అవమానము ఎక్కువ, రాజ్య పూజ్యము తక్కువ, వ్యయం ఎక్కువ కావడం జరుగుతుంది ఆదాయము తగ్గిపోతుంది కావున మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే సమాజంలో రాజ్య పూజ్యం గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆదాయం పెరుగుతుంది వ్యయము తగ్గుతుంది అదేవిధంగా రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే తీవ్ర ప్రమాదాలు జరిగి కుటుంబాలకు ప్రాణ నష్టం వాటిల్లి తీరని శోకం కలుగుతుంది కావున యువత దుర్వ్యసనాలకు బానిసలు కాకుండా ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళికాబద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని సాధించాలని, ఈ సమాజానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అలానే రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ భాషిపంగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాల అంచున నిలిచిన తల్లి -శిశువు,యశోద మలక్పేట్ వైద్యుల సమయోచిత చికిత్సతో ఇరువురి ప్రాణాలూ సురక్షితం

డాక్టర్ జోత్స్న ఎం.వి గైనకాలాజిస్ట్,డాక్టర్. సత్యప్రియ సాహూ,పేడియాట్రిషిన్,







**విజేత ఖమ్మం ప్రతినిధి :-** ప్రాణాలకు ముప్పుగా మారే అత్యంత క్లిష్ట గర్భధారణను విజయవంతంగా నిర్వహించి, ముందుగానే జన్మించిన శిశువును సైతం సురక్షితంగా కాపాడిన ఘటన వైద్య రంగంలో విశేషంగా నిలిచింది. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న గర్భిణి, అలాగే పుట్టిన వెంటనే శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొన్న ప్రీటర్మ్ శిశువును యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ,మలక్ పేట్ వైద్యులు తమ నైపుణ్యం, అత్యాధునిక సాంకేతికతతో కాపాడారు. 32 ఏళ్ల గర్భిణికి బైకోర్నుయేట్ యూటరస్, షార్ట్ సర్విక్స్, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత వంటి అనేక క్లిష్ట సమస్యలు ఉండటంతో పాటు గతంలో గర్భధారణలో ఇబ్బందులు ఎదురైన చరిత్ర ఉండటంతో ఈ కేసు వైద్యులకు సవాలుగా మారింది. గర్భస్రావం లేదా ముందస్తు ప్రసవం జరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, డా. జ్యోత్స్న ఆధ్వర్యంలోని వైద్య బృందం సమయానికి స్పందించి అత్యాధునిక లాపరోస్కోపిక్ అబ్డామినల్ సర్క్లాజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. అలాగే బ్లాడర్ డిసెక్షన్, సిస్టోస్కోపీ, యూరెటరోస్కోపీ వంటి ప్రక్రియలను కూడా సమర్థవంతంగా పూర్తి చేశారు. రోగిలో ఉన్న రక్తహీనతను తగ్గించేందుకు రక్తం ఎక్కించడంతో పాటు, నిరంతర ఫీటల్ మానిటరింగ్ ద్వారా గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కాపాడారు. తరువాత 34 వారాల్లో గర్భిణికి ఫీటల్ డిస్ట్రెస్ ఏర్పడటంతో అత్యవసర సిజేరియన్ ద్వారా శిశువును ప్రసవించారు. 2.13 కిలోల బరువుతో జన్మించిన శిశువుకు పుట్టిన వెంటనే శ్వాస సమస్యలు తలెత్తడంతో ఎన్ఐసీయూ లో చేర్పించి ప్రత్యేక చికిత్స అందించారు. డా. సత్యప్రియ సాహూ పర్యవేక్షణలో శిశువుకు సీపాప్ ద్వారా శ్వాస సహాయం, జాండీస్‌కు ఫోటోథెరపీ, హైపోకాల్సీమియాకు మందులు అందించడంతో శిశువు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. కేవలం 38 గంటల్లోనే శ్వాస సమస్య తగ్గిపోవడం, క్రమంగా తల్లిపాలను స్వీకరించడం ప్రారంభించడం, ఎటువంటి ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించకపోవడం వైద్యులను ఆనందానికి గురి చేసింది. చికిత్స అనంతరం తల్లి, శిశువు ఇద్దరినీ స్థిర ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డా. జ్యోత్స్న మాట్లాడుతూ, “ఇలాంటి క్లిష్ట గర్భధారణలను సమయానికి గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు” అన్నారు. డా. సత్యప్రియ సాహూ మాట్లాడుతూ, “ప్రీటర్మ్ శిశువులకు తక్షణమే సరైన చికిత్స అందిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చు” అని తెలిపారు. యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపిన ప్రకారం, అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, సమన్వయంతో కూడిన చికిత్స విధానాల వల్ల ఇలాంటి క్లిష్ట కేసులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.

# వర్షాధారిత పథకంతో రైతులకు ఆధునిక సాయం




నల్లవెల్లిలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్షేత్ర పర్యటన





**విజేత,సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** వర్షాధారిత పథకంతో రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.గుమ్మడిదల మండలం నల్లవెల్లి గ్రామంలో అమలవుతున్న వర్షాధారిత అభివృద్ధి పథకాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం పరిశీలించి, రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.ఈ సందర్భంగా రైతు కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని పరిశీలించి, పథకం కింద అందించిన వ్యవసాయ పరికరాల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ పథకం ద్వారా రైతులు పొందుతున్న లాభాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. వర్షాధారిత అభివృద్ధి పథకం కింద మొత్తం 115 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32.10 లక్షల విలువైన రాయితీలు మరియు వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో ప్లాస్టిక్ క్రేట్లు, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులు వంటి పరికరాలు ఉన్నాయని తెలిపారు. రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అధిక లాభాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకొని, సమిష్టిగా పంటల విక్రయం చేయడంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమీకృతంగా వినియోగించుకుంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఉషారాణి, మండల రెవెన్యూ అధికారి పరమేశ్వర్, ఉద్యాన అధికారులు మౌనిక, అనూష, వ్యవసాయ అధికారి, హెచ్ఈఓలు విట్టల్, స్వామి, ఏఈ హౌసింగ్, సర్పంచ్ రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా పనిచేసే ఏకైక సంస్థ బిజెపి

ఓటరు జాబితాయే మన బ్రహ్మాస్త్రం. దొంగ ఓట్లపై డేగకన్ను వేయాలి.

బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం చేసుకోండి.

ఖమ్మం ప్రశిక్షణా శిబిరంలో శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు దిశానిర్దేశం.





**విజేత ఖమ్మం ప్రతినిధి :** కుటుంబ పాలనకు తావులేకుండా, దేశమాతసేవకోసశీజాతీయవాదాన్ని పుణికిపుచ్చుకుని నిస్వార్థంగా పనిచేసే ఏకైక సంస్థ భారతీయ జనతా పార్టీ అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. పార్టీలో ఒక సాధారణ కార్యకర్త సైతం అత్యున్నతమైన జాతీయ అధ్యక్షుడు కాగలరని, ఆ ఘనత కేవలం భాజపాకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో మంగళవారం మూడవ పట్టణ అధ్యక్షురాలు దార్ల మల్లేశ్వరి అధ్యక్షతన ‘పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్’ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరితంగా జరిగింది. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన. పార్టీ సిద్ధాంతాలు, పనితీరుపై కార్యకర్తలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఇతర పార్టీల నుంచి కొత్తగా భాజపాలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ముందుగా పార్టీ సిద్ధాంతాలను పూర్తిగా వంటబట్టించుకోవాలని సూచించారు. పార్టీలో పదవుల కంటే క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే బూత్ స్థాయి అధ్యక్షుడికే అత్యున్నత గౌరవం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలనుకునే ప్రతి నాయకుడు ముందుగా తమ బూత్ పరిధిలోని ఓటరు జాబితాపై (ఓటర్ లిస్ట్) సంపూర్ణ పట్టు సాధించాలన్నారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కార్యకర్తలు అత్యంత చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. తమ బూత్ పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? వారిలో ఎవరైనా మరణించారా? వేరే ప్రాంతాలకు వలస వెళ్లారా? తదితర వివరాలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలన్నారు. ముఖ్యంగా రోహింగ్యాలు లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వారు అక్రమంగా దొంగ ఓట్లు నమోదు చేసుకున్నారా అనే దానిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి వాటిని తక్షణమే అడ్డుకోవాలని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీల నాయకులు కుట్రపూరితంగా భాజపాకు సానుభూతిపరులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం ఉన్నందున ముందే అప్రమత్తం కావాలన్నారు. ప్రతి బూత్‌కు బాధ్యత వహించే బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌వో) ఎప్పటికప్పుడు మమేకమవుతూ సమన్వయం చేసుకోవాలని, జాబితాను పక్కాగా సరిచూసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్తా ఓటర్లతో మమేకమై క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, గెంటెల విద్యాసాగర్, మేకల నాగేందర్, నకిరేకంటి వీరభద్రం,డోకుపర్తి రవీందర్, ఫమ్మి అనిత, ఆర్ వి ఎస్ యాదవ్ , శాసనాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను భారాలుతగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం - నున్నా నాగేశ్వరరావు



సిపిఎం ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ ఆఫీస్ ముందు భారీ ధర్నా.






**విజేత ఖమ్మం ప్రతినిధి :-** ఖమ్మం నగర ప్రజలపై వేస్తున్న ఇంటి పన్ను ఆర్థిక భారాలను వెంటనే తగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ముందు మంగళవారం భారీ ధర్నా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అనంత్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థకు ఆస్తి పన్నులు వేసే అధికారం కట్టబెట్టడం వెనుక మతలబు ఏమిటో ఖమ్మం నగర ప్రజలకు కమిషనర్, మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో వేస్తున్న ఆస్తి పన్నులపై అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉంది అని వెంటనే గత పాలసీ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇంటి పన్నులపై పాత జి ఓ ఉత్తర్వులను పక్కన బెట్టి మరీ క్రమబద్ధీకరణ పేరుతో ఎడాపెడా నగర ప్రజలపై ఇంటి పన్నులు వేసి వసూలు చేస్తున్నారు అని ఆరోపించారు. ప్రస్తుతం వస్తున్న ఇంటి టాక్స్ బిల్లులు చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు వేసే విధానాన్ని పలు సర్కిల్ గా విభజన చేసి మరీ టాక్స్ లు వేయడం అనాలోచిత నిర్ణయం అని దుయ్యబట్టారు. పన్నులపై వడ్డీ పేరుతో మరింతగా అపరాధ రుసుం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు పైగా ఈ సంవత్సరం ఏప్రిల్ ఫస్ట్ నుంచి మరింత ఇంటి పన్నులు పెరుగుతాయి అని మీడియా వస్తున్న వార్తలపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు ఆమోదం తెలిపి క్రమక్రమంగా ప్రజలపై వివిధ రూపాల్లో ఆర్థిక భారాలు వేసే పనిలో పడింది అని ఆరోపించారు. చెత్త పన్ను, నీళ్ళ పన్ను, ఇంటి పన్ను ఇలా భారాలు వేయడం ప్రయివేటీకరణ లో భాగమే అని విమర్శించారు. తక్షణమే ఖమ్మం కార్పొరేషన్ అధికారులు, కమీషన్, మేయర్, మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని నగర ప్రజలకు ఇంటి పన్నుల భారాలు నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే నగర ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కె శ్రీనివాసురావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. వారు మాట్లాడుతూ పై అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్య పరిష్కారం కోసం తమ ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, టి విష్ణు, ఎం ఏ జబ్బర్, భుక్యా శ్రీనువాసురావు, ఎస్ కే మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, పి రమ్య , ఎస్ కె నాగులు మీరా , బోడపట్ల సుదర్శన్, ఉపేంద్ర, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి నాగసులోచన, కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సి, ఎస్టీ పిసిఆర్, అట్రాసిటీ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు





జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహణ

కలెక్టరేట్ లో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్.

**విజేత ఖమ్మం ప్రతినిధి :** జిల్లాలో ఎస్సి, ఎస్టీ ప్రివెన్షన్ అఫ్ అట్రాసిటీ (పిఓఏ), పౌర హక్కుల పరిరక్షణ (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ -పిసిఆర్) యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

వివిధ సమస్యలపై జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అందించిన వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ సేవ ఫౌండేషన్ వారు అందిస్తున్న సేవలు దృష్ట్యా అందులో ఉన్న నిరాశ్రయులకు, అనాథలకు గుర్తింపు పత్రాలు ఆధార్, ఇతరత్రా లభించేలా నిబంధన మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సభ్యులు తెలిపిన సమస్యల్లో జిల్లా స్థాయిలో ఉన్న సమస్యలు ఇక్కడే త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని, పింఛన్ల జారీ, అవుట్సోర్సింగ్ ఉద్యోగం, పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహించడం, ఖమ్మం నగరం కార్పోరేషన్ 60వ డివిజన్ లో ఉన్న ఎస్సీ స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని అన్నారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం అందించిన విధివిధానాల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పలు ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలలో ఎస్సీ, ఎస్టీలు లబ్ధిదారులకు ప్రాధాన్యత లభించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఈడీ ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, సభ్యులు జె. దాస్ మహారాజ్, అన్నం శ్రీనివాసరావు, ఎం. అంజయ్య, జీవి. భద్రయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు కు కాబినేట్ ఆమోదం తెలుపడం తో హర్షం వ్యక్తం చేసిన న్యాయవాదులు



**విజేత, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ కేంద్రం లోని చేవెళ్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కాబినేట్ ఆమోదం తెలుపడం తో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.గతం లో అడ్వకేట్ ల హత్యలతో న్యాయవాధుల రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని పోరాటం చేసినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి ఉపయోగం లేకపోగా నిత్యం ఇలాంటి దాడులు ఎక్కువ కావడమే కాకుండా కొన్ని రోజుల క్రితం చేవెళ్ల కోర్ట్ లో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ స్వప్న హత్య జరగడం తో చేవెళ్ల లో పెద్ద ఎత్తున ర్యాలీ చేయడం తో పాటు ఆమన్గల్ బార్ అసోసియేషన్ వారి ప్రోత్బలం తో అసెంబ్లీ నీ ముట్టడించడమే కాకుండా న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరాహార దీక్షలు చేపట్టారు.దీంతో రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు కు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మధుసూదన్ రెడ్డి, సురేందర్, గీతా వనజాక్షి, మాధురి, జైపాల్ లు మాట్లాడుతూ చాలా రోజుల నుండి న్యాయవాధులపై జరుగుతున్న దాడులకు, హత్య లకు ఈ రోజు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లు ను కేబినెట్ ఆమోదించడం హర్షించ దగిన విషయం అని అన్నారు. గతం లో వామన రావు దంపతుల హత్య జరిగినప్పుడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ల ప్రొటెక్షన్ గురించి ఆలోచించినట్లు అయితే ఈ రోజు స్వప్న లాంటి పలువురు న్యాయవాదుల ప్రాణాలు పోయేవి కాదు అని అన్నారు. ఇప్పటికైనా అడ్వకేట్ ల సమస్యలను తెలుసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మా అడ్వకేట్ ల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాము అని అన్నారు. న్యాయవాదులు శ్రీనివాస్,చొక్కంపేట రవీందర్ మాట్లాడుతూ స్వప్న హత్య చాలా బాధాకరమైన విషయం ఈ రోజు ఆమె హత్య తో చేవెళ్ల న్యాయవాదులు ఏకమై అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు ఆమోదించడం లో కీలక పాత్ర పోషించారు అని, స్వప్న హత్య కు కారణమైన వ్యక్తులకి ఏ న్యాయవాది కూడా బెయిల్ ఇవ్వకూడదు అని, వారికి కఠినమైన శిక్ష పడితేనే అడ్వకేట్ స్వప్న ఆత్మ కి శాంతి చేకూరుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో చేవెళ్ల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మొకరం నర్సిములు,స్పోర్ట్స్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ తలారి ప్రకాశం,ప్రదీప్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జంగమయ్య గుట్టలో శివయోగి శివాచార్య మహాస్వామి జన్మదినోత్సవ వేడుకలు









**విజేత,సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** సదాశిపేట మండలంలోని తంగడపల్లి గ్రామంలో వెలిసినటువంటి శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశ్రమ పీఠాధితులు ష.బ్ర.108 శ్రీ శ్రీ శివయోగి శివాచార్య మహా స్వాముల వారి 31వ జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ వేడుకల్లో భాగంగా స్వామి వారు ఉదయము కోటి బిల్వ లింగేశ్వర మహాస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము తదుపరి అపగారి జన్మదిన వేడుకల్లో భాగంగా తెలుగు ,కర్ణాటక మహారాష్ట్ర భక్తుల చేత మంగళ స్నానము మరియు పట్టు వస్త్రాల సమర్పణ, మధ్యాహ్నము అన్న ప్రసాద వితరణ తదుపరి సాయంత్రము ధార్మిక సభ ఉద్ఘాతన అప్పగారి చేతుల మీదుగా దీపారాధన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ధార్మిక ఉపదేశము అందజేశారు.ఈ కార్యక్రమంలో ష.బ్ర 108 శ్రీ కొట్టు కొట్టురేశ్వర శివాచార్య మహాస్వామి, ష.బ్ర.108 శ్రీ వీరేశ్వర శివాచార్య మహా స్వామి ధనసిరి, శ్రీ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ బర్దిపూర్, జాకెట్ కల్ తాత,తెలంగాణ రాష్ట్ర,సంగారెడ్డి జిల్లా, సదాశివపేట పట్టణ, మండల వీరశైవ సమాజ ప్రముఖులు,అర్చక పురోహితులు,జంగమ మహేశ్వరులు ,సదాశివపేట మండలంలోని పలు గ్రామాల సర్పంచులు సదాశివపేట పట్టణంలోని ప్రముఖులు ,రాజకీయ నాయకులు , కర్ణాటక ప్రముఖులు తంగడపల్లి గ్రామ భరియు మండలంలోని భక్తులందరూ కూడా పాల్గొని అప్పగారి యొక్క ఆశీస్సులు అందుకున్నారు తదుపరి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు



**విజేత దేవరపల్లి ;** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు రణభేరి3.0 లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ఒకరోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఆర్థిక బకాయిలు అనగా పి ఆర్ సి కమిషన్ ను వెంటనే నియమించాలని, విశ్రాంత ఉపాధ్యాయుల యొక్క గ్రాడ్యుటీ, సరెండర్ లీవ్ సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని)29% ఐ ఆర్ ను ప్రకటించాలని మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని మరియు చనిపోయిన ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలకు సంబంధించి కారుణ్య నియామకాలు చేపట్టాలని హెల్త్ కార్డులు, మెడికల్ బిల్లులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయుల సర్వీస్ కు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం కొరకు వచ్చిన తక్షణమే కమిటీ వేయాలని ఇలా అనేక అంశాలపై నిరాహార దీక్ష కార్యక్రమం జరిగింది ప్రభుత్వం వెంటనే స్పందించి పై సమస్యలను పరిష్కరించకపోతే తదుపరి ఏప్రిల్ ఒకటి రెండవ తేదీల్లో జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో వద్దని రహార్దీక్ష కార్యక్రమం చేపడతామని తదుపరి రాష్ట్ర స్థాయిలో కూడా సరైన దీక్షలో ప్రారంభించి ముందు ముందు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి భవిష్యత్తులో సచివాలయం ముట్టడికి కూడా వెనకాడ బోమని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ తక్షణమే ప్రభుత్వం స్పందించి పై ఆర్థిక అంశాలు పై దృష్టిపెట్టాలని నియోజవర్గ స్థాయిలో దేవరపల్లి గోపాలపురం నల్లజర్ల యుపిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరపల్లి నుండి నాయకులు ఎం. నాగేశ్వర రావు, ఓరుగంటి శివ నాగ ప్రసాద్ రాజు, ఎం డి శ్రీనివాస్, కొమరపు ఉమాకాంత్, వి. ఉదయ్, పి. వెంకట రావు మరియు గోపాలపురం నాయకులు జి వెంకటేశ్వరరావు , ఎం నాగేశ్వరావు, ఏ జాన

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: డా. మట్టా దయానంద్

## సత్తుపల్లి ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులకు బహుమతులు, విద్యా ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు





**విజేత, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని పాత సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ ఎంపీపీఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గెలిచిన నాటి నుండి ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌తో కలిసి ప్రతి హాస్టల్, పాఠశాలను సందర్శిస్తూ విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా సహకరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ పాఠశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, 2026 సంవత్సరానికి సంబంధించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఎంఈవో నక్క రాజేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కౌన్సిలర్లు మానస రాము, నసీమ షరీఫ్, హకీం, జగన్నాథం శ్రీను, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహభరితంగా సాగి విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

# సత్తుపల్లి ఏరియా స్ట్రక్చర్ కమిటీ సమావేశం



## ఏరియా ఉద్యోగుల సమస్యలపై చర్చించిన ఐఎన్టీయూసీ

**విజేత, సత్తుపల్లి :** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం స్ట్రక్చర్ సమావేశంజి.ఎంకార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు.సత్తుపల్లి ఏరియా పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏరియా అధికారులతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఐ.ఎన్.టి.యూ.సీ నాయకులు కోరారు.స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా సత్తుపల్లి డిస్పెన్సరీ లో గైనకాలజిస్ట్ డాక్టర్ను నియమిస్తూ డిస్పెన్సరీని అన్ని వసతులతో కూడిన ఏరియా హాస్పిటల్ గా ఆధునికరించాలని కోరారు. ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికి జీ.ఎం కార్యాలయంలో వివిధ డిపార్ట్మెంట్ల మ్యాన్ పవర్ ఏర్పాటు ముఖ్యంగా పర్సనల్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి వార్షిక ఉత్పత్తి లక్ష్యంలో సత్తుపల్లి నుండి అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి రవాణా జరుగుతున్న సందర్భంగా ఏరియా ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని మరియు 75 % ప్లేడేలు ఇవ్వాలని కోరారు.ప్రాతినిధ్య సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని , ఇప్పటివరకు ఏ విధంగా ఉత్పత్తి లక్ష్యసాధనలో సహకరించారో ఇకముందు కూడా సహకరించి సంస్థ పురోఅభివృద్ధిలో తోడ్పడాలని జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు బొల్లం శ్రీనివాస్ ( ఎస్ ఓ టు జి.ఎం ) , రామ కృష్ణ ( ఏ జి ఎం సివిల్ ) , మోహన్ రావు ( పర్సనల్ ఆఫీసర్ ) , ప్రహ్లాద్ ( ప్రాజెక్ట్ ఆఫీసర్ , జే.వి.ఆర్ ఓసి ) , సునీల్ వర్మ ( ప్రాజెక్ట్ ఆఫీసర్ , కిష్టారం ఓసి ) , శ్రీనివాస్ రావు ( ప్రాజెక్ట్ ఇంజినీర్ ) , సోమశేఖర్ ( డీజీఎం , జే.వి.ఆర్ సి.హెచ్.పి ) , రాజేశ్వరరావు ( మేనేజర్ , జే.వి.ఆర్ ఓసి ) , రామకృష్ణ ( మేనేజర్ , కిష్టారం ఓసి ) , అభిలాష్ ( సెక్యూరిటీ ఆఫీసర్ ) , సివిల్ ఇంజనీర్ రవికుమార్ , నరసింహారావు ( ఏ సీ.ఎమ్.ఓ , డిస్పెన్సరీ ) ఇతర అధికారులు , ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘం నాయకులు కోటేశ్వరరావు , క్రాంతి కుమార్ , నాగ ప్రకాష్ పాల్గొన్నారు.

# తణుకులో బీజేపీ శిక్షణా తరగతులు





**విజేత, తాడేపల్లిగూడెం:** పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో (తణుకు) స్థానిక వికే కన్వెన్షన్‌లో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ -2026 కార్యకమం రెండో రోజు ఉత్సాహంగా సాగింది. పట్టణ అధ్యక్షులు బొల్లాడి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'బీజేపీ చరిత్ర - వికాసం' అనే అంశంపై పశ్చిమగోదావరి జిల్లా మీడియా కన్వీనర్ నరిశె సోమేశ్వరరావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముల్లపూడి రేణుక, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నరసాపురం జిల్లా పూర్వ అధ్యక్షులు నార్ని తాతాజీ పార్టీ బలోపేతంపై ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రస్థానాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో పట్టణ, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నాపెద్దా మురిసేలా...నిర్మల్ వండర్ ల్యాండ్!





**విజేత మామడ:** నిర్మల్ పట్టణానికి కూతవేటు దూరంలో ఆదిలాబాద్ వైపు వెళ్ళే రహదారి ప్రక్కన రాణాపూర్ గ్రామ పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వారం రోజులక్రితం ప్రారంభించబడిన నిర్మల్ వండర్ ల్యాండ్ సందర్శకులకు చక్కని అనుభూతి కలిగిస్తుంది.సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో అమ్యూజ్మెంట్,వాటర్ పార్క్ తో చూపరులను చూడగానే ఆకట్టునేల డిజైన్ చేశారు. ఔత్సాహికుల కోసం రాకెట్ ఎజెక్టర్, 360 సైకిల్,జిప్ లైన్,స్కై సైకిల్,ఇలా ముప్పై రకాల యాక్టివిటీస్ అందుబాటులో ఉంచారు. కృత్రిమ జలపాతం అదనపు ఆకర్షణ.నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ... కేవలం సంవత్సర కాలవ్యవధిలో ఎనిమిదికోట్ల రూపాయల వ్యయంతో నిర్మించి సినీనటి ఐశ్వర్య రాజేష్ ప్రత్యేక అతిథి గా,స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఆరేళ్ల వయసు పిల్లలనుండి అరవయ్యేళ్ల పెద్దలను కూడా ఆహ్లాదపరిచి అలరించే స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు.రెయిన్ డ్యాన్స్ చేసే వారిని ఉత్తేజ పరిచేవిధంగా ఖరీదైన మ్యూజిక్ సిస్టమ్,భోజన ప్రియులకు రుచికరమైన,నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు.ఇన్ని ప్రత్యేకతలతో రూపొందించిన వండర్లాండ్ వలన సెలవు దినాల్లో పిల్లలకు,పెద్దలకు వినోదం కోసం వ్యయ ప్రయాసలతో నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్ళే అవసరం లేదంటున్నారు. పిల్లలకు,పెద్దలకు ఆనందాన్ని ఉత్సాహాన్ని కలగజేస్తుందని వివరించారు.

# వంట గ్యాస్ కొరతతో సామాన్యుల బతుకు భారమైతే కేంద్రానికి పట్టదా

## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్





**విజేత ఖమ్మం ప్రతినిధి :** రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నేడు అసెంబ్లీ ముందరి గన్ పార్క్ వద్ద నిరసన చేపట్టారు. చేతిలో గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు పట్టుకుని, ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో గ్యాస్ కొరత వేధిస్తుంటే, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏమాత్రం సఖ్యత లేదని మండిపడ్డారు. కేంద్రం గ్యాస్ పంపడం లేదని రాష్ట్రం, రాష్ట్రమే సరిగ్గా పంపిణీ చేయలేకపోతోందని కేంద్రం ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, కృత్రిమ కొరతను సృష్టిస్తూ సామాన్య గృహిణులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కేంద్రంతో మాట్లాడి గ్యాస్ నిల్వలను తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని, కేవలం ప్రకటనలకే పరిమితమవుతూ ప్రజలను వంచిస్తోందని ధ్వజమెత్తారు. గ్యాస్ దొరక్క హోటళ్లు, చిన్న వ్యాపారులు మూతపడే స్థితికి వచ్చారని, గృహ వినియోగదారులు నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుంటే సామాన్యుడు బలిపశువు అవుతున్నాడని అన్నారు". కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఆర్మూర్ మున్సిపల్ కార్మికుల ధర్నాలి



**విజేత, ఆర్మూర్ :** ఆర్మూర్ కేంద్రంగా మున్సిపల్ కార్మికులు వారి సమస్యలపై మున్సిపల్ యంత్రంగానికి సమ్మె నోటీస్ ఇస్తామని వారి సమస్యలు తీర్చే కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం వారి సమస్యలపై మున్సిపల్ అధికారులు మరియు చైర్మన్ వైస్ చైర్మన్లు పాలకవర్గం వెంటనే స్పందించాలని మున్సిపల్ నందు బైఠాయించి ఇన్ని రోజులుగా చెబుతున్న మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడని , మాకు రావలసిన పైసలు, ఇ ఆర్ సి డబ్బులు,ఈఎస్ఐ జమ అవుతుంది కానీ మా అకౌంట్లో డబ్బులు జమ కావట్లేదని కాబోతున్నారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పీ.ఎఫ్ డబ్బులు, 16 నెలల నుండి పెండింగ్లో ఉన్న పట్టించుకోవడం లేదు,నెలకు రెండు సెలవులు ఇవ్వాలని, మరియు మున్సిపల్ కార్మికుల సిబ్బందిని పెంచాలని పని భారం ఎక్కువగా కావడంవల్ల మేము అనారోగ్యాల పాలు అవుతున్నామని కార్మికులు వాపోయారు ఈ సందర్భంగా ఇందారపు రాజు ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు , బిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దండి వెంకటి,రాజేందర్, అరవింద్ నరసయ్య మరియు కార్మిక సంఘ నాయకులు పాల్గొని కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.దానికి స్పందించిన కమిషనర్ వారం రోజుల్లోగా వీరి సమస్యలకు చైర్మన్ కౌన్సిల్ సభ్యులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేసతాము అని హామీ ఇచ్చారు.

# కళ్యాణలక్ష్మి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు







**విజేత, పాపన్నపేట :** పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఉపయోగపడుతుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. పాపన్నపేట మండలంలోని మంజీర గార్డెన్ లో మంగళవారం కళ్యాలక్ష్మి- షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించి 55 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి- షాదీ ముబారక్ 55 చెక్కులు ద్వారా రూ.55 లక్షల 6 వేల 380 రూపాయలు లబ్ధి చేకూరిందని అన్నారు. మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు వారి వివాహం సమయంలో ఒకేసారి రూ100,116 ఆర్థిక సహాయం లభిస్తుందని, వివాహ సంబంధిత ఖర్చులను భరించటానికి, ఆర్థిక భారం లేకుండా వివాహ వేడుకను నిర్వహించడంలో కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి ఈ సహాయం అందించబడుతుందన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ క్రింద చెక్కులు అందజేసి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పి ప్రశాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి, పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావణి నరేందర్ గౌడ్, గోవింద్ నాయక్, డిసిసి అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, ప్రేమ్, ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు ఎల్ నరేందర్ గౌడ్, మూశెట్టి కిష్టయ్య, దోసని సంగమేశ్వర్, క్యాసగళ్ల ప్రవీణ్, చోటు, ఇబ్రహీం, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్లకు ఇంటిస్థలాల అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తాను : ప్రత్తిపాటి






**విజేత చిలకలూరిపేట :** ప్రభుత్వం పాస్టర్లకు రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోంది. క్రైస్తవ సమాజ హితానికి, క్రైస్తవుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయంలో పాస్టర్లు భాగస్వాములు కావాలి. పేదరికం లేని సమాజ నిర్మాణానికి తమవంతు సహాయసహకారాలు అందించాలి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ వార్షిక సర్వసభ్య సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి. కూటమిప్రభుత్వం క్రైస్తవ సమాజ హితానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రైస్తవుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని, పాస్టర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని దివ్యశాంతి నిలయంలో ప్రముఖ దైవజనులు నందమూరి క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ వార్షిక సర్వసభ్య సమావేశం -2026కు ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయం అయిన పేదరికం లేని సమాజ నిర్మాణంలో క్రైస్తవ మతబోధకులు భాగస్వాములు కావాలని ప్రత్తిపాటి సూచించారు. పాస్టర్లకు ప్రభుత్వం ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోందని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రభువు సేవలో తరించే ప్రతి ఒక్కరూ ఈ ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

**నియోజకవర్గంలోని పాస్టర్లకు ఇంటిస్థలాలు అందచేయడంపై ప్రభుత్వంతో చర్చిస్తాను**

పాస్లర్లు ఎప్పటినుంచో ఇళ్లస్థలాలు కావాలని కోరుతున్నారని, నియోజకవర్గంలోని పాస్టర్ల తరపున సమస్యపై ప్రభుత్వంతో చర్చించి, దీనికి పరిష్కారమార్గం చూస్తానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఇంటి స్థలం లేని పేదలకుఉచితంగా ఇళ్లపట్టాలు ఇవ్వడానికి సిద్ధమైందని, అదే జాబితాలో పాస్టర్లకు కూడా ఇళ్లస్థలాలు అందించేందుకు కృషి చేస్తామని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభువు బోధనలు, ఆయన సూచించిన శాంతి, ప్రేమ మార్గాన్ని ప్రతి క్రైస్తవుడు/క్రైస్తవురాలు తప్పకుండా ఆచరించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర నాయకులు ఇనగంటి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, జాకోబు రాజు, టీడీపీ నాయకులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రం నుండి తరిమికొట్టండి

### 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ





**విజేత ఖమ్మం ప్రతినిధి :** తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మలచడానికి తెలంగాణలోని అన్ని వర్గాల మరియు ప్రభుత్వ సంస్థల సహకారంతో మన తెలంగాణ ప్రభుత్వం యావత్ తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేయుచున్నది. ఇది ఒక నిరంతర ప్రక్రియ. డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రం నుండి తరిమికొట్టడం మరియు డ్రగ్స్ బారిన పడిన ఆఖరి వ్యక్తిని కూడా డ్రగ్స్ నుండి విముక్తి కలిగించడమే తెలంగాణ ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యము" అని తెలుపుతూ ఈ రోజు 1టౌన్ పరిధి లోని సెయింట్ మేరీ స్కూల్లో ప్రోగ్రాం ఏర్పాటు చేసి సమాచారం అందించిన (1908) వారికి తగిన ప్రోత్సాహకం ఇవ్వబడును వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ప్రజలకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కలెక్టర్ , మేయర్ , డిప్యూటీ మేయర్ , 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ , వడ్డేబోయిన నరసింహారావు, పాషా, దారమళ్ల భాస్కర్, బాల, గోపాల్ ,రాము, గణేష్, లక్కీ, నాగ దుర్గ, అజయ్, శ్యామ్, సాయి, నవీన్ పాల్గొన్నారు.

# తాళ్ల గురజాల గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం




**విజేత బెల్లంపల్లి :** వంగ రామన్న గౌడ్ ఆధ్వర్యంలో తాళ్ల గురజాల గ్రామంలో ఈరోజు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో 50 మందికి పైగా గ్రామ ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 15 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. కంటి నిపుణుడు అంజయ్య బాధితులకు తగిన సూచనలు ఇచ్చాడు. అవసరమైన వారికి లైన్స్ క్లబ్ సహకారంతో ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ డాకూరి సురేష్, లైన్స్ క్లబ్ బెల్లంపల్లి అధ్యక్షురాలు అరుణ సుందరి, రంగు సందీప్ గౌడ్, మెరుగు మల్లేష్, కృష్ణ గౌడ్, నక్క రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచల రామయ్యకు 300కిలోల గోటి తలంబ్రాలు

### గోటి తలంబ్రాల్లో రామకోటి రామరాజు కృషి అభినందనీయం
### భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్ రావు
### 300కిలోల గోటి తలంబ్రాలను అందజేసిన రామకోటి సంస్థ
### రామయ్య కళ్యానానికి తెలంగాణ నలుమూలల నుండి తలంబ్రాలు



**విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ భద్రాచల సీతారాముల కళ్యానానికి ప్రతి సంవత్సరం గోటి తలంబ్రాలు అందిస్తుంది. ఈ సంవత్సరం 3క్వింటాల్లకు పైగా గోటి తలంబ్రాలను మంగళవారం నాడు భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్ రావుకి అందజేశారు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక,అధ్యక్షులు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు. గత సంవత్సరం 250కిలోల కోటి తలంబ్రాలు అందించగా ఈ సంవత్సరం 300కిలోల గోటి తలంబ్రాలను అందించింది. 4వ సారి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది భక్తులు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లు ఓలిచి అందించామని రామకోటి రామరాజు తెలిపారు. గత 30సంవత్సరాలనుండి చేస్తున్న ఆధ్యాత్మిక రామభక్తి అమోఘం అని గోటి తలంబ్రాల సేకరణలో కృషి,పట్టుదల చూపిన రామకోటి రామరాజును అభినందించారు ఈవో దామోదర్ రావు. ప్రతి భక్తునిచే రామకోటి వ్రాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో రామకోటి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తొర్రూర్ రాజీవ్ గృహకల్ప దేవాలయ కమిటీ నియామకం



**విజేత, ఇబ్రహీంపట్నం :-** గ్రేటర్ హైదరాబాద్, ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో దేవాలయల అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. కాలనీలోని దేవాలయానికి కొత్త కమిటీని సోమవారం రాత్రి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కమిటీ నియామకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిటీ సభ్యులు ఆలయ నిర్వహణను పారదర్శకంగా కొనసాగించడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కాలనీ వాసులు కూడా తమ వంతు సహకారం అందించి దేవాలయాన్ని అభివృద్ధి పరచాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.

# సామాజిక, కుల వివక్షత ఉద్యమాలలో కెవిపిఎస్ పోరాటం చేస్తుంది

### గజ్వేల్ ఏసిపి నర్సింలు




**విజేత గజ్వేల్ :** సామాజిక కులవ్యక్షత ఉద్యమాలలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ముందంజలో ఉంటుందని గజ్వేల్ ఏసిపి నర్సింలు అన్నారు. కెవిపిఎస్ డైరీని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కేల్లి బాలకిషన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు పోట్టోల్ల దాసు ఆధ్వర్యంలో డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఎసిపి నర్సింలు మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో కులవ్యక్షత సామాజిక ఉద్యమాలలో అనేక పోరాటాలలో కెవిపిఎస్ సంఘం ముందంజలో ఉండి ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. కుల వివక్షత పాటించవద్దని మనసులందరూ సమానమే అని అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు గీసు మల్లేశం బలిపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

# సింహ గర్జన సెగ కలెక్టరేట్‌కు కదిలిన బీసీవై పార్టీ శ్రేణులు






**విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి :** భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ పిలుపు మేరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌కు భారీగా తరలి వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సింహ గర్జన వేదికగా పార్టీ ప్రతిపాదించిన ఐదు కీలక డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశం లో నాయకులు మాట్లాడుతూ బీసీ హక్కుల విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయకూడదని వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ ఐదు డిమాండ్లను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ నాయకత్వంలో ఏప్రిల్ 11వ తేదీన విజయవాడలో ఆమరణ దీక్షకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. బీసీ రక్షణ చట్టం తక్షణ అమలు,రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాల భూమి కేటాయింపు,బీసీ కులాల కార్పొరేషన్లకు తగిన నిధుల విడుదల,రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహణ,విద్య ఉద్యోగాలు,స్థానిక సంస్థలు మరియు చట్టసభల్లో బీసీరిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయుడు నాగేశ్వర్ (కాకినాడ జిల్లా కన్వీనర్),సీరం శ్రీను (పిఠాపురం కన్వీనర్),గొంప శివకుమార్ (ప్రత్తిపాడు కన్వీనర్),రాయుడు సుధాకర్ (పి ఏ సి, ఎ పి),పాలేపు గణేష్ (కాకినాడ టౌన్ యువ నాయకుడు),శాంతి,దేవి,జి.రాజా,పురందాస్ రమేష్,గోర్ల శివాజీ,పొలిపోయిన గణేష్,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ శిక్షణ శిబిరం





**విజేత చొప్పదండి :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణ కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ శిక్షణ తరగతులలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి కార్యకర్త ప్రజలతో కలసి పనిచేసి పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలి" అని కార్యకర్తలకు వారు సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి బలోపేతం, సోషల్ మీడియా నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ పాత్ర వంటి పలు ముఖ్య అంశాలపై వక్తలు కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొని విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి క్రిష్ణా రెడ్డి, చొప్పదండి పట్టణ మండల అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్, మొగిలి మహేష్, నాయకులు జిట్ట కుమార్,సింగిరెడ్డి భూంరెడ్డి, గొల్ల గట్టయ్య, మంచికట్ల మల్లేశ్, మాచర్ల శశి కుమార్, జక్కుల శంకర్, తోట కోటేశ్, గన్ను నర్సింహ రెడ్డి, సంగ నరేశ్, విలాసాగరం అంజయ్య, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం




**విజేత, బాల్కొండ :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం,జోనల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి శిబిరంలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ నందు రోజువారి సంత,వారంతపు సంత వేలం



**విజేత, బాల్కొండ :** నిజాంబాద్ జిల్లా బాల్కొండ మండలం గ్రామ పంచాయతీ నందు గాండ్ల రాజేష్ సర్పంచ్ గారి అధ్యక్షతన వారంతపు సంత వేలం మరియు రోజు వారి మార్కెట్ వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలం లో అత్యధికముగా వేలం పాట (?6,25000) పాడి వారంతపు సంత ను ద్యావతి ముత్యం దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా రోజు వారి మార్కెట్ లో అత్యధికముగా వేలం పాట (?1,45000)పాడి భోజన్న దక్కించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్ రాజేందర్,వార్డు సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత



**విజేత ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోగత రెండు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మరణించిన చల్లూరి బాలవ్వ కుటుంబ సభ్యులను మండల గౌడ సంఘ సభ్యులు మంగళవారం పరామర్శించారు.జవహర్ పేట గ్రామానికి చెందిన ముత్యం బాలాగౌడ్ మరణించిన కుటుంబ సభ్యులు చల్లూరి భానుగౌడ్ కి 5 వేల రూపాయల నగదు అందించారు.బాలవ్వ మరణం బాధాకరం అన్నారు.కుటుంబానికి తీరని లోటని,వారి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు బాలాగౌడ్ మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్ గౌడ్,సాయగౌడ్,భాస్కర్ గౌడ్,రాజయ్య గౌడ్, దేవేందర్ గౌడ్,ముంజ భాస్కర్ గౌడ్,అనిల్ గౌడ్,అంజయ్య గౌడ్, ప్రదీప్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,సాయి గౌడ్, ముత్యం రాజు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ బండెమ్మ జాతర





**విజేత రామసముద్రం :** అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం, కాప్పల్లె గ్రామపంచాయతీలోని గజ్జలవారిపల్లి గ్రామంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న శ్రీ బండెమ్మ జాతరను గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈతొలి పూజను వెంకటేష్ రాజు, మాధవి దంపతులు బండెమ్మ వారికి బోనాలు దీలు సమపర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామాన్ని విద్యుత్ దీపాలంకరణ, పచ్చని తోరణాలతో తో ముస్తాబు చేయడం జరిగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో 7మంది గ్రామ దేవత దీపాలు చెల్లించి తమ మొక్కలను తీర్చుకున్నారు.బుధవారం అమ్మవారి మెరివని,గురువారం రథోత్సవం నిర్వహించడం జరుగుతుందని కార్యనిర్వాహకులు, గ్రామస్థులు తెలిపారు.ఈ దీపోత్సవ కార్యక్రమంలో కోవా క్రిష్ణమూర్తి,వాలిరెడ్డి, విశ్వనాథ రెడ్డి, రమేష్ బాబు, విశ్వనాథ్ ఆచారి గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను



**విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండలం సిరిగిరి పురం గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిరిగిరిపురం గ్రామ సర్పంచి కృష్ణవేణి శీను, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించి, పాఠశాల ముందస్తు బడిబాట కార్యక్రమ కరపత్రాలను, బ్రోచర్లను ఉపాధ్యాయుల, గ్రామ పాలకవర్గ సమక్షంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశామని, పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో ఉంటాయని ఈ సందర్భంగా సర్పంచ్ హామీ ఇచ్చారు.పాఠశాలకు వచ్చే పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిరిగిరిపురం గ్రామ పాలకవర్గం, పంచాయతీ సెక్రెటరీ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గా నక్క మహేష్

### మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ అందుకున్న

### రావిరాల గ్రామానికి చెందిన నక్క మహేష్






**విజేత మహేశ్వరం :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామ పట్టణానికి చెందిన నక్క మహేష్ మోటివేషనల్ స్పీకర్గా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. శని ఆదివారాల్లో నల్గొండ లోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ నూనె సుదర్శన్ చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్, కోటా సరిత నారాయణ కవిత, గూడూరు అంజిరెడ్డి, వీరవెల్లి శ్రీలత, హర్షిత, రవీంద్ర చారి, బాలు, సరిత మొదలగు ట్రైనర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నక్క మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు యువతకి ప్రేరణ కలిగించి వారి లక్ష్యాలు సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం, సమాజ సేవతో దేశాభివృద్ధిలో పాల్గొనడం తన కర్తవ్యం అని తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గురూజీ గంపా నాగేశ్వరరావు కి నక్క మహేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పునః ప్రతిష్టకు సిద్ధమైన హనుమాన్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం

### 400 ఏళ్ల చారిత్రక ఆలయంలో నేడు మహోత్సవం మహా అన్నదానానికి విస్తృత ఏర్పాట్లు



**విజేత, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్ నగర్లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం పునః ప్రతిష్ట మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. సుమారు 400 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ఆలయంలో నేడు (బుధవారం) ఉదయం 9 గంటలకు పునః ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాగాలు, హోమాలు నిర్వహిస్తూ ఆలయ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది. పునః ప్రతిష్ట అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో అన్నదానానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం తాగునీరు, పార్కింగ్, క్యూలైన్ల వంటి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఈ చారిత్రక ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం గ్రామ ప్రజలందరికీ ఒక గొప్ప ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తుందని తెలిపారు. సత్తుపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం సత్తుపల్లి ప్రాంతంలో ఒక ముఖ్య ఆధ్యాత్మిక ఘట్టంగా నిలవనుంది.

# ప్రపంచ బందిపోటుగా మారిన అమెరికన్ సామ్రాజ వాదాన్ని ఎదిరిద్దాం





### లౌకిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు.. మతోన్మాద శక్తులను పెకిలిద్దాం

### భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం ఉద్యమిద్దాం

### సిపిఎం ఆధ్వర్యంలో సదాశివపేటలో భగత్ సింగ్ వర్ధంతి

### సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి జయరాజ్

**విజేత, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** ప్రపంచ బందిపోటుగా మారిన అమెరికన్ సామ్రాజ వాదాన్ని ఎదిరిద్దామని, లౌకిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు.. మతోన్మాద శక్తులను పెకిలిద్దామని భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ఉద్యమించాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి జయరాజు అన్నారు. మంగళవారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సదాశివపేట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం కార్మికులు, యువత పోరాడాలన్నారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని కొనసాగించేందుకు మనమంతా ముందు నిలవాలన్నారు. భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశం పట్ల ప్రజల పట్ల మక్కువ పెంచుకున్నాడని తెలిపాడు. స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ పాలకుల నుండి విముక్తి పొందడమే కాదు, సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలి. ప్రజలందరూ సామరస్యంతో మానసిక బానిసత్వం నుండి బయటపడిన రోజునే మనం సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించినట్లని భావించాడు భగత్ సింగ్ అని గుర్తుచేశారు.మతోన్మాదం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ దేశం లౌకిక దేశంగా ఉండాలని ఆయన పదేపదే ప్రస్తావించాడన్నారు. దోపిడీ పీడన లేని, అసమానతలు లేని సమాజాన్ని సోషలిజం మాత్రమే అందిస్తుందన్నారు. సంపద సృష్టి కర్తలైన కార్మిక, కర్షక వర్గాల ఐక్యత సాధించి దోపిడీ లేని సమసమాజ సమాజాన్ని నిర్మించుకవడం కోసం భగత్ సింగ్ మార్గంలో ప్రయాణిద్దామని కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధనాలు రూపొందిస్తున్న పాలకులపై పోరాడుదామని పిలుపుచ్చారు. సామ్రాజ్యవాదాన్ని ప్రఘీఘటించి పోరాడిన భగత్ సింగ్ చైతన్య స్పూర్తి ఈ దేశానికి అవసరమన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, ఆధిపత్యాన్ని ఎదిరిస్తున్న, దేశాలపై యుద్ధాలు ప్రకటిస్తూ, విధ్వంసాలు సృష్టిస్తుంది. దేశాలను ఆక్రమించడమే కాదు, దేశాధ్యక్షులను సైతం ఎత్తుకెళ్లి బంధించడం,లేదా చంపడమే చేస్తుందన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తుందన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే కాదు, ఈ దేశంలో సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పుడమే తమ అంతిమ లక్ష్యమని భగత్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశాడనీ గుర్తు చేశారు. దేశ పౌరులుగా నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న మతతత్వ, మతోన్మాద, కార్పోరేట్ రాజకీయాలకు వ్యతిరేకంగా, ప్రపంచాధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న సామ్రాజవాదానికి వ్యతిరేకంగా కలసికట్టుగా ఐక్యంగా పోరాడటమే భగత్ సింగ్ కు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఏరియా కమిటీ సభ్యులు రమేష్ గౌడ్ భూషణం ఏ సబ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్య వైద్యం వ్యవసాయ రంగాల అభివృద్ధికి హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు కేటాయింపు పై హర్షం







### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**విజేత,జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు కేటాయించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం మహా ముత్తారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదులు, ఆధునికీకరించిన మరుగుదొడ్లు, ఎంఆర్‌సి భవనం మరియు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటపరికరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అవగాహన కల్పించేందుకు హెచ్ డి ఎఫ్ సి ఎక్స్‌పోజర్ విజిట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలను హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సి ఎస్ ఆర్ నిధులు ద్వారా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో సిఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, హెచ్‌డిఎఫ్‌సి జోనల్ మేనేజర్ రుణాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.కుమారస్వామి, తహశీల్దార్ శ్రీనివాస రావు, ఎంపిడిఓ.ప్రకాష్, ఎంఈఓ రవీందర్ రెడ్డి, హెచ్‌డిఎఫ్‌సి ఏరియామేనేజర్ సంపత్,పాఠశాలప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్సీ హెల్త్ టెస్టుల పేరిట కోట్ల దోపిడీ?

### సిఎస్సీ హెల్త్ టెస్టుల పేరిట కోట్ల దోపిడీ?

### కార్మికుల్లో భయాందోళన సృష్టిస్తున్న తప్పుడు రిపోర్టులు

### వెల్ఫేర్ బోర్డు నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు

### ప్రైవేటీకరణ రద్దు చేయాలని కార్మిక సంఘాల డిమాండ్

### పెంచాలి మరణ సహాయం, ప్రసూతి--వివాహ కానుకలు

### బ్రోకర్ల వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

### మార్చి 30న 'చలో హైదరాబాద్'కు ద

### భారీగా తరలిరావాలని పిలుపు

### సిఐటియు అనుబంధ జిల్లా

### ఉపాధ్యక్షులు మల్లూరు చంద్ర శేఖర్.





**విజేత, సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో సిఎస్సీ హెల్త్ టెస్టుల పేరిట భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల నిధులు కోట్ల రూపాయల మేర దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారం కార్మికుల్లో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, లేబర్ కార్డులు కలిగిన కార్మికుల ఇండ్లకు, పని ప్రదేశాలకు వెళ్లి రక్త పరీక్షలు నిర్వహిస్తూ తప్పుడు రిపోర్టులు ఇస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉచిత హెల్త్ టెస్టుల పేరుతో వెల్ఫేర్ బోర్డు నిధులను భారీగా దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం అనుభవం లేని సిఎస్సీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు పథకాలలో మరణ సహాయాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించడం సరైన చర్య కాదని, కోట్ల రూపాయల ప్రీమియం చెల్లింపులు నిలిపివేయాలని కోరారు. అలాగే, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రసూతి మరియు వివాహ కానుకలను రూ.30 వేల నుంచి రూ.1 లక్షకు పెంచాలని, సహజ మరణ సహాయాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. బ్రోకర్ల వ్యవస్థను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తూ, ఈ సమస్యలపై స్పందన లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో మార్చి 30న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనరేట్ వద్ద "చలో హైదరాబాద్" పేరుతో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కావూరి వెంకటేశ్వరరావు, పట్టణ నాయకులు స్వప్నవీసు చరణ్ కుమార్, బాలమర్తి భాస్కర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కృత్రిమ కొరతను వెంటనే పరిష్కరించండి - మండల కార్యదర్శి చోడెం దుర్గ



**విజేత బుట్టాయగూడెం :** బుట్టాయగూడెం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. తహసిల్దార్ ఎం రాధాకృష్ణ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి చోడెం దుర్గ మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్ లో దళారులు పెంచిన గ్యాస్ ధరలను నియంత్రించి, బండల కొరతను వినియోగదారులకు గృహ అవసరాలకు అందుబాటులో ఉంచాలని, పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేయాలని అన్నారు. పట్టణ స్థాయిలో రెండు సెంట్లు, పల్లె స్థాయిలో మూడు సెంట్లు, ఇల్లు లేని వారికి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని దీని ప్రభావం హోటల్స్ చిరు వ్యాపారులు గృహ అవసరాలకు సంబంధించిన వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని , వేలాది కంపెనీలు మూతపడ్డాయని దీని పరిణామం కార్మికుల మీద పడిందని ఆవేదన వ్యక్తం చేశారు . పొరుగు దేశాలలో యుద్ధాలు జరిగితే మనకు ఎలాంటి నష్టం లేదని మోడీ చెప్పారని మరి గ్యాస్ ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించారు . ఇండస్ట్రియల్స్ ఎందుకు మూతపడ్డాయని , ఒక దేశంతో ఒక దేశానికి కచ్చితంగా ఏదో రూపంలో సంబంధాలు ఉంటాయని అది వ్యాపారమైన ఎగుమతులైన దిగుమతులైన దీనికి నిదర్శనం ఇజ్రాయిల్ , ఇరాన్, దుబాయ్ లాంటి దేశాలు యుద్ధాలు జరగడమేనని వాపోయారు . కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని దుర్గ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నిరుద్యోగ యువతకు నెలకు 3000 రూపాయలు వారి యొక్క అకౌంట్లో జమ చేస్తామని గొప్పగా హామీలు ఇచ్చారు కానీ హామీలన్నీ నోటి మాటలకే సరిపోయాయని ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని అన్నారు. గ్యాస్ కొరత వలన చిరు వ్యాపారుల ఆర్థిక పరిస్థితి చిత్రమైందని ఆమె ప్రభుత్వం పై ధ్వజమెత్తరు. గ్యాస్ కృత్రిమ కొరతను వెంటనే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో గ్యాస్ బండలను తీసుకురావాలని చోడెం దుర్గ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాదం దుర్గారావు , మడకం దుర్గారావు , సరియం దుర్గమ్మ , దుర్గారావు సి హెచ్ రమణ , తెల్లం మునీశ్వరరావు, రత్నకుమారి , శ్రీనివాసరావు బత్తిన సింగారమ్మ మరియు శ్రీను పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకురావాలి

### అసెంబ్లీలో పలు అంశాలను ప్రస్తావించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



**విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని నిజామాబాద్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. గత సంవత్సరం బడ్జెట్లో 6 గ్యారంటీలకు రూ.56,083 కోట్లు కేటాయిస్తే.. ఈసారి మాత్రం 50,713 కోట్ల కే పరిమితం చేసిందన్నారు. సుమారు 5,370 కోట్లు కోత విధించిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకొస్తామని స్వయంగా రాహుల్ గాంధీ ప్రకటించారని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేస్తారని నమ్మకం తమకు లేదన్నారు. ఎందుకంటే గత సంవత్సరం 49,315 కోట్లు కేటాయింపులు చేసి 24 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మల్లో నిర్మిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బడ్జెట్ లో మాత్రం నిధులను భారీగా కోత విధించిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గత సంవత్సరం 12,571 కోట్లు కేటాయిస్తే ఈసారి మాత్రం కేవలం 5500 కోట్లు కేటాయించడం దారుణం అన్నారు. సుమారు 7 వేల కోట్లు కోత విధించిందన్నారు. మరో విచిత్రం ఏమిటంటే గత మూడు బడ్జెట్లలో కూడా ఇందిరమ్మ ఇళ్ల కోసం కేటాయించిన నిధుల్లో కేవలం 300 కోట్లు మాత్రమే తెలిపారు. ఉచిత బస్సు పథకం ద్వారా వేలాదిగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని స్వయంగా ప్రభుత్వమే ప్రకటించిందని చెప్పారు. కానీ ఈ బడ్జెట్లో ఆటో డ్రైవర్లకు మొండి చేయి చూపించిందన్నారు. ఏడాదికి రూ.12 వేల భృతి, కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. అలాగే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని అన్నారు. అలాగే ఎస్సీ సంక్షేమానికి గత సంవత్సరంలో 40 వేల కోట్లు నిధులు కేటాయించగా ఈసారి 11 వేలకు పరిమితం చేయడం దారుణం అన్నారు. ఏది ఏమైనా ప్రస్తుత బడ్జెట్ నిరాశ కలిగించిందని తక్షణమే సవరణ చేయాలన్నారు.

## వామ్మో.. ఏంట్రా ఇది.. సిగరెట్ల కంటే బీడీ తాగడం ప్రమాదకరమా..? అసలు నిజం ఇదే

పొగాకును అనేక రూపాల్లో వినియోగిస్తారు.. వాటిలో బీడీలు – సిగరెట్లు సర్వసాధారణం. బీడీలు సిగరెట్ల కంటే తక్కువ హానికరం అని చాలా మంది నమ్ముతారు. అయితే, ఈ నమ్మకం చాలా ప్రమాదకరమైనది. రెండూ శరీరానికి హానికరం. క్యాన్సర్, గుండె జబ్బులు, స్ట్రోక్ – ఊపిరితిత్తుల సమస్యలు వంటి వ్యాధులు బీడీలు, సిగరెట్లు రెండింటి వల్ల సంభవిస్తాయి. బీడీలు, సిగరెట్లు రెండూ ఆరోగ్యానికి హానికరం.. కానీ బీడీల కంటే.. సిగరెట్లు తాగడం మంచిది.. సిగరెట్లు కంటే బీడీలు తక్కువ ప్రమాదకరమని.. భావించడం తప్పు.. రెండు హానికరమైనవేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. బీడీలు తాగడం కొన్నిసార్లు సిగరెట్ల కంటే ఎక్కువ హానికరం అని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. బీడీలు సిగరెట్లకు సురక్షితమైన ప్రత్యామ్నాయం అని మీరు అనుకుంటే.. అది పూర్తి అపోహ మాత్రమే.. పొగాకును అనేక రూపాల్లో వినియోగిస్తారు.. వాటిలో బీడీలు సిగరెట్లు సర్వసాధారణం. బీడీలు సిగరెట్ల కంటే తక్కువ హానికరం అని చాలా మంది నమ్ముతారు. అయితే, ఈ నమ్మకం చాలా ప్రమాదకరమైనది. రెండూ శరీరానికి హానికరం. క్యాన్సర్, గుండె జబ్బులు, స్ట్రోక్ %–% ఊపిరితిత్తుల సమస్యలు వంటి వ్యాధులు బీడీలు, సిగరెట్లు రెండింటి వల్ల సంభవిస్తాయి. ఒకటి క్యాన్సర్‌కు కారణమవుతుందని, మరొకటి కాదని నమ్మకం తప్పు.. ఇలా భావిస్తే అది ముర?త్వమే అవుతుంది.. గ్రామీణ ప్రాంతాలలో, తక్కువ ఆదాయ వర్గాలలో, బీడీలు సిగరెట్ల కంటే తక్కువ హానికరం అని ప్రజలు నమ్ముతారు. ఎందుకంటే వాటిలో పొగాకు, టెండు ఆకులు మాత్రమే ఉంటాయి. అయితే, బీడీలు కూడా అంతే హానికరం మాత్రమే కాదు.. చాలా సందర్భాలలో, అవి సిగరెట్ల కంటే కూడా ప్రమాదకరమైనవి అని పరిశోధనలు చెబుతున్నాయి. బీడీలలో ఫిల్టర్ లేకపోవడం దీనికి ప్రధాన కారణం.. ఇది పొగను ఫిల్టర్ చేయకుండా నిరోధిస్తుంది. ఇంకా, బీడీ పొగ సిగరెట్ల కంటే విషపూరితమైనది. ఎందుకంటే, పొగాకుతో పాటు, బీడీలలో పొగలోకి విడుదలయ్యే అనేక హానికరమైన పదార్థాలు ఉంటాయి. ఈ పొగలో ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్‌కు కారణమయ్యే క్యాన్సర్ కారక పదార్థాలు ఉంటాయి.




**బీడీ సిగరెట్ మధ్య తేడా**

సిగరెట్లలో పొగాకుతో పాటు వివిధ రసాయనాలు, ఫిల్టర్లు ఉంటాయి, అయితే బీడీలలో టెండు ఆకులలో చుట్టబడిన పొగాకు ఉంటుంది. సిగరెట్లలో ఫిల్టర్లు ఉంటాయి, కానీ బీడీలలో ఉండవు. బీడీలోని టెండు ఆకు కాలినప్పుడు, పొగ మందంగా మారుతుంది. అందుకే ధూమపానం చేసే వ్యక్తి ఎక్కువ పొగను పీల్చుకుంటాడు.. ఇది మరింత ప్రమాదకరం..

**పరిశోధన ఏం చెబుతోంది?**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం.. బీడీ తాగేవారికి సిగరెట్ తాగేవారి కంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. బీడీ తాగడం వల్ల దీర్ఘకాలిక బ్రోన్కైటిస్ ఉబ్బసం వంటి వ్యాధులు వస్తాయి. బీడీ తాగడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. బీడీ తాగేవారికి నోరు, గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బీడీ తాగేవారికి నికోటిన్ టాక్సిన్స్ కూడా ఎక్కువ స్థాయిలో ఉంటాయి.

**బీడీలలో సిగరెట్ల కంటే ఎక్కువ నికోటిన్ ఉంటుంది..**

మేదాంత హాస్పిటల్‌లోని పల్మనాలజీ విభాగానికి చెందిన డాక్టర్ భగవాన్ మంత్రి మాట్లాడుతూ.. బీడీసిగరెట్.. రెండూ ఆరోగ్యానికి హానికరం అని వివరిస్తున్నారు. కానీ బీడీలు తాగడం వల్ల శరీరంలోకి ఎక్కువ నికోటిన్, మోనాక్సైడ్ విడుదలవుతాయి. ఎందుకంటే బీడీ పొగ మందంగా ఉంటుంది. బీడీలు తాగడానికి కూడా ఎక్కువ శక్తి అవసరం.. ఇది ఊపిరితిత్తులపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది, దీనివల్ల పొగ రక్తప్రవాహంలోకి చేరుతుంది.

**సమాజం కుటుంబంపై ప్రభావం**

బీడీలు తాగడం వల్ల కలిగే హాని కేవలం ధూమపానం చేసేవారికి మాత్రమే పరిమితం కాదు.. ఆ పొగ దగ్గర్లో ఉన్నవారికి కూడా పాసివ్ స్మోకింగ్ ప్రమాదం కలిగిస్తుంది. ఈ పొగ ముఖ్యంగా పిల్లలు, మహిళలకు ప్రమాదకరం.. ఇంకా ఉబ్బసం, అలెర్జీలు ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతుంది. కావున.. ధూమపానానికి దూరంగా ఉండండి.. మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు.. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేయకుండా చూడండి..

# నీళ్ల వరద కాదు, కమీషన్ల దురద!



యావత్ ప్రపంచమే మెచ్చిన బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వింతగా వ్యవహరిస్తున్నారు. పూటకో మాట మాట్లాడుతూ నవ్వుల పాలవుతున్నారు. మొన్నటివరకు అభాంబాలు వేస్తూ, ఆరోపణలు చేసిన కాళేశ్వరం నీళ్లనే వాడుకోవాల్సి రావడంతో ఆయన కొత్త అబద్ధాలకు తెరలేపారు. హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపులో భాగంగా మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి నీళ్లు తెస్తామని చెప్తూనే, ఆ నీళ్లు కాళేశ్వరం జలాలు కావని నాలుక మడతేస్తుండటం హాస్యాస్పదం.

హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంగా గండిపేట వద్ద నిర్వహించిన సభలో సీఎం రేవంత్ మరోమారు తన నోటికి అబద్ధాల పనిచెప్పారు. కాళేశ్వరం ఎప్పుడో కూలిపోయిందని, ఎల్లంపల్లి నుంచి గోదావరి నీళ్లను తెస్తున్నామని కొత్త రాగం ఆలపించారు. ఓ వైపు కాళే శ్వరంపై నిందలు వేస్తూనే, మరోవైపు కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్‌ను వాడుకోవడం కాంగ్రెస్ సర్కార్ కపటనీతికి నిదర్శనం. ఎల్లంపల్లిని కాంగ్రెస్సే నిర్మించి ఉంటే, తెలంగాణ రాకముందు రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు అప్పుడే నీళ్లెందుకివ్వలేదు? హైదరాబాద్‌కు గోదావరి జలాలను ఎందుకు తరలించలేదు? తెలంగాణ వచ్చాక ఎల్లంపల్లిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తిచేసింది కేసీఆర్ ప్రభుత్వం. శంకుస్థాపన జరిగిన 12 ఏండ్లకు, తెలంగాణ వచ్చిన రెండేండ్ల తర్వాత 2016, నవంబర్‌లో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు వేములవాడ మండలంలోని ఫాజిల్‌నగర్ నుంచి చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ మైనర్ ఇరిగేషన్‌కు గోదావరి జలాలను విడుదల చేశారు. ఇక మల్లన్నసాగర్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు దాన్ని కూడా కాంగ్రెస్ సర్కారు నిర్మించిందని చెప్పడం వింతల్లో కెల్లా వింత. మల్లన్నసాగర్‌ను నిర్మిస్తే భూకంపాలు వస్తాయని రైతులను భయపెట్టిన చరిత్రను మర్చిపోతే ఎట్లా రేవంత్‌రెడ్డీ? ప్రాణహితలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మల్లన్నసాగర్ కెపాసిటీ 1.15 టీఎంసీలే. కానీ, కేసీఆర్ కట్టిన మల్లన్నసాగర్ కెపాసిటీ 50 టీఎంసీలు. కాంగ్రెస్ నాయకులు మాటిమాటికీ చెప్పే ప్రాణహిత-చేవెళ్ల మొత్తం కెపాసిటీ 16 టీఎంసీలే.ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు నీళ్లను చేరవేసేందుకు పెద్ద తతంగమే నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు రెండో దశలో భాగంగా ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను మధ్య మానేరుకు తరలించారు. రెండో దశ లో మొత్తం మూడు ప్యాకేజీలున్నాయి. మొదట ఎల్లంపల్లి నుంచి మేడారం రిజర్వాయర్‌లోకి, అక్కడినుంచి శ్రీరాంసాగర్ వరద కాలువకు, ఆ తర్వాత మధ్యమానేరుకు నీళ్లు చేరుతాయి. మూడో దశలో భాగంగా మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని తరలిస్తారు. మొదట మధ్యమానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్‌కు, అక్కడినుంచి శ్రీరంగనాయకసాగర్‌కు, అక్కడినుంచి మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలు వచ్చి పడుతాయి. కేసీఆర్ నిర్మించిన మేడారం, అనంతగిరి, శ్రీరంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు, అప్రోచ్ కెనాల్స్, టన్నెళ్లు.. లేకుండా ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను మళ్లించగలరా?

హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపును గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రతిపాదించింది. అయితే, కొండపోచమ్మసాగర్ నుంచి వెయ్యి కోట్లతో కేసీఆర్ సర్కార్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దానినే రేవంత్ ప్రభుత్వం మల్లన్నసాగర్‌కు మార్చి, ప్రాజెక్టు వ్యయాన్ని 7,300 కోట్లకు పెంచి, నీళ్లకు బదులు కమీషన్ల వరద పారించాలని చూస్తున్నది. గండిపేట నుంచి మల్లన్నసాగర్ సుమారు 118 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 557 మీటర్ల ఎత్తున ఉంటుంది. అదే కొండపోచమ్మసాగర్ గండిపేటకు 70 కిలోమీటర్ల దూరంలో, 618 మీటర్లపైన ఉంటుంది. 540 మీటర్ల ఎత్తున ఉండే గండిపేటకు 618 మీటర్ల ఎత్తున ఉండే కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా తక్కువ ఖర్చుతో నీళ్లను తీసుకురావచ్చు. ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు కాళేశ్వరంలో భాగంగా నీళ్లు తరలించే మార్గం అందుబాటులో ఉండనే ఉన్నది. కానీ, అలాచేస్తే కమీషన్లు రావు కదా? ఫలాలిచ్చే చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్టు.. ఇట్లా కాళేశ్వరం ప్రయోజనాలను వాడుకుంటూ దాని మీదనే నిందలు వేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రజలు, మేధావులు, బుద్ధిజీవులు, ముఖ్యంగా అన్నదాతలు ఇకనైనా కాంగ్రెస్ నైజాన్ని గ్రహించాలి. కాళేశ్వరంతో పాటు తెలంగాణను కాపాడుకోవాలి. అప్పుడే తెలంగాణతోపాటు మనమూ మనగలుగుతాం.

## పనీర్ టాపు.. టోఫు తోపు!



శాఖాహారులు ఇష్టంగా తినే వాటిలో 'పనీర్' ముందుంటుంది. 'టోఫు' కూడా అచ్చం పనీర్‌లాగే ఉంటుంది. కానీ, చాలామందికి ఈ రెండిటి మధ్య తేడాలు సరిగ్గా తెలియదు. మరి.. మీ ఆహార అవసరాలకు ఏదైతే సరిపోతుంది? బరువు తగ్గాలంటే, మధుమేహం అదుపులో ఉండాలంటే.. దేన్ని తీసుకోవాలి? ఆరోగ్యానికి వీటిలో ఏది మంచిది? తెలుసుకోవాలంటే.. ఇది చదివేయండి. పనీర్.. అచ్చంగా బర్రె, ఆవు పాల నుంచి తయారవుతుంది. ఇందులో క్యాల్షియం, కొవ్వు ఎక్కువగా ఉంటుంది. అదే.. టోఫును సోయా పాలతో తయారు చేస్తారు. దీనిలో తక్కువ కొవ్వు, ఎక్కువ ఫైబర్ లభిస్తుంది. ఈ రెండూ దేనికవే ప్రత్యేకమైనవి. దేని ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువలు దానికి ఉంటాయి. కాబట్టి, మీ ఆరోగ్య అవసరాలను బట్టి ఎంపిక చేసుకోవడం మంచిది.

**ఐరన్:** పనీర్‌తో పోలిస్తే టోఫులో ఎక్కువ ఐరన్ ఉంటుంది. 100 గ్రాముల టోఫులో 5.4 మిల్లీ గ్రాముల ఐరన్ లభిస్తుంది. పనీర్‌లో 0.1 మిల్లీ గ్రాములు మాత్రమే ఉంటుంది. కాబట్టి, రక్తహీనతతో బాధపడేవారికి టోఫు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**ప్రొటీన్లు:** 100 గ్రాముల పనీర్‌లో 18.3 గ్రాముల ప్రొటీన్ ఉన్నట్లు తేలింది. అదే టోఫులో.. 6.9 గ్రాములు మాత్రమే ఉంటుంది. కాబట్టి, జిమ్‌కు వెళ్లేవారు, బరువు పెరగాలని అనుకునేవాళ్లు పనీర్‌ను ఎంపిక చేసుకోవాలి. పనీర్.. కండరాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

**కొవ్వు:** పనీర్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. 100 గ్రాముల పనీర్‌లో 20.8 గ్రాముల కొవ్వు లభిస్తుంది. మరోవైపు.. టోఫులో 2.7 గ్రాముల కొవ్వు మాత్రమే ఉంటుంది. కాబట్టి, బరువు తగ్గాలంటే.. టోఫును ఆహారంలో భాగం చేసుకోవాలి. అధిక బరువుతో బాధపడేవాళ్లు.. పనీర్‌ను పక్కన పెట్టేయాలి.

**క్యాల్షియం:** పనీర్‌లోనే క్యాల్షియం ఎక్కువగా లభిస్తుంది. 100 గ్రాముల పనీర్ తీసుకుంటే.. శరీరానికి 208 మిల్లీ గ్రాముల క్యాల్షియం అందుతుంది. అదే టోఫులో 130 మిల్లీ గ్రాములు మాత్రమే ఉంటుంది! కాబట్టి, దంతాలు, ఎముకల ఆరోగ్యం కోసం పనీర్‌ను తీసుకోవడం బెటర్.

**కార్బోహైడ్రేట్స్:** పాలతో తయారైనప్పటికీ.. పనీర్‌లో కార్బోహైడ్రేట్ స్థాయులు తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల పనీర్‌లో దాదాపు 1.2 గ్రాముల కార్బోహైడ్రేట్స్ లభిస్తాయి. అదే.. టోఫులో 2.4 గ్రాములు, అంటే పనీర్ కంటే రెట్టింపు కార్బోహైడ్రేట్ కంటెంట్ ఉంటుంది. కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పనీర్ మంచి ఎంపిక. **రీలు:** 100 గ్రాముల పనీర్‌తో 265 కేలరీలు అందుతాయి. టోఫులో 62 కేలరీలు మాత్రమే లభిస్తాయి. బరువు తగ్గాలని అనుకుంటే.. టోఫును తీసుకోవాలి.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### పేదల జీవితాల్లో చిరునవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు







**విజేత,పాపన్నపేట :** నిరుపేదల జీవితాల్లో చిరునవ్వులు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. పాపన్నపేట మండలంలోని పొడిచన్ పల్లి గ్రామంలో 48 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాల మంజూరి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో పూరి గుడిసెలు ఉండకుండా చూడడమే లక్ష్యమన్నారు. పేదలకు, అర్హులందరికీ గౌరవప్రదంగా బ్రతకడానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో చిరునవ్వులు చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. విడుతల వారీగా ఎన్ని ఇండ్లు మంజూరు చేయడానికి అయినా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నా యన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.118 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. ఏప్రిల్ మాసంలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేస్తామని తెలిపారు. కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు నిరుపేదల పాలిట వరమని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్థిక స్తోమత లేకుండా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాల ఆడపిల్లలకు పెండ్లి సహాయ నిమిత్తం ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పి ప్రశాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పి ప్రభాకర్ రెడ్డి, గోవింద్ నాయక్, హౌసింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్ ఎర్ర వెంకయ్య, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల వంటగది ప్రారంభం



**విజేత మామడ:** మండలం లోని కమల్కోట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం కోసం నూతనంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన వంటగది ని మంగళవారం సర్పంచ్ ముత్యం రెడ్డి ప్రారంభించారు.ఆయనతో పాటు కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రశాంత్, వార్డ్ మెంబర్లు, పాఠశాల ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాలు, పెరుగు, తేనెతో ఈ ఆహారపదార్థాలను కలిపి తిన్నారో అనారోగ్యానికి వెల్కం బోర్డ్ పెట్టేసినట్లే..



మనం ఏది తిన్నా అది మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. చాలా ఆహారాలు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ.. కొన్ని ఆహారాలు తప్పుగా తీసుకుంటే ప్రయోజనానికి బదులుగా ఆరోగ్యానికి హానికరంగా మారతాయి. ఈ రోజు ఆయుర్వేదం ప్రకారం పొరపాటున కూడా ఏ ఆహారాలను కలిపి తీసుకోకూడదో ఈ రోజు తెలుసుకుందాం.. గత కొంత కాలంగా ఫిట్‌నెస్, ఆరోగ్యం గురించి అవగాహన పెరుగుతోంది. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆహారం, ఆరోగ్యానికి మధ్య దగ్గరి సంబంధం ఉన్నందున ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం వెనుక అవసరాన్ని గుర్తిస్తున్నారు. అయితే తెలిసీ, తెలియక చాలా మంది జంక్ ఫుడ్ తింటున్నారు. దీంతో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ నేపథ్యంలో యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఆయుర్వేదం విశిష్టతని తెలియజెస్తూ అవగాన కలిగిస్తున్నారు. పతంజలి సహ వ్యవస్థాపకుడు ఆచార్య బాలకృష్ణ ఆయుర్వేదం గురించి అవగాహన కల్పించడానికి అనేక పుస్తకాలు రాశారు. అలాంటి ఒక పుస్తకం "ది సైన్స్ ఆఫ్ ఆయుర్వేదం". ఈ పుస్తకం ఏ ఆహార కలయికలు మీ ఆరోగ్యానికి హానికరం అని వివరిస్తుంది. వీటిని కలిపి తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపడమే కాదు విష పదార్థాలు కూడా పెరుగుతాయి. అందువల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, శరీరాన్ని హాని నుంచి రక్షించుకోవడానికి ఏ ఆహారాలను కలిపి తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ చెడు ఆహార కలయికల గురించి ఈ రోజు వివరంగా అన్వేషిద్దాం.

**తప్పుడు ఆహార కలయికల వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలు**

" ఆయుర్వేద శాస్త్రం " అనే పుస్తకం మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని ఎలా ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందో వివరిస్తుంది. కొన్ని ఆహారాలు ప్రయోజనకరం.. అయితే అవి మరికొన్ని ఆహారాలతో కలిస్తే ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఒకదానికొకటి సరిగ్గా సరిపోని ఆహారాలు తినడం వల్ల శరీరంలో విషపూరిత పదార్థాలు పేరుకుపోతాయి. వీటిని వదిలించుకోవడం కష్టమవుతుంది. ఇది జీర్ణక్రియను బలహీనపరుస్తుంది. శరీరంలోని మూలకాలను (లోహాలు) అసమతుల్యత చేస్తుంది. వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. తప్పుడు ఆహారం తినడం వల్ల శరీర రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అలసట, ఒత్తిడి వంటి సమస్యలకు దారితీస్తుంది. అంతే కాదు తప్పుడు సమయంలో, తప్పుడు వాతావరణంలో తప్పుడు ఆహారం తినడం, చాలా చల్లగా లేదా చాలా వేడిగా ఉన్న ఆహారం తినడం కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

**ఈ ఆహార కలయికలు ఆరోగ్యానికి మంచిది కాదు.**

పాలతో ఈ ఆహారాలను తీసుకోవద్దు: ఎముకలను బలోపేతం చేయడానికి పాలు చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. అయితే పాలతో కలిపి తినకూడని కొన్ని ఆహారాలు ఉన్నాయి. ఉదాహరణకు పెరుగును పాలతో కలిపి తినకూడదు. ముల్లంగి, ముల్లంగి ఆకులు, పచ్చి సలాడ్, నగ్గెట్స్, చింతపండు, పుచ్చకాయ, కొబ్బరి, జిలేబీ, నువ్వుల లడ్డు, శనగలు, పప్పులు, సిట్రస్ పండ్లు మొదలైన ఆహారాలను కూడా పాలతో కలిపి తినకూడదు.

**పెరుగుతో వీటిని తినవద్దు:** పెరుగు చల్లదనాన్ని కలిగిస్తుంది. కనుక పెరుగుతో వేడి ఆహారాన్ని తినకపోవడం మంచిది. జున్ను (పనీర్), కీర దోసకాయలను పెరుగుతో తినకూడదు.

**బియ్యంతో వీటిని నివారించండి:** ఆయుర్వేదం ప్రకారం బియ్యంతో వెనిగర్ వాడకూడదు.

## విమాన ప్రయాణికులకు బ్యాడ్‌న్యూస్..!

## ఉచితంగా ఇస్తే.. ఛార్జీలు పెరుగుతాయి!



విమానయాన సంస్థలకు 60 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్న డీజీసీఏ ఉత్తర్వుపై ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం తమ ఆర్థిక స్థితిని దెబ్బతీసి, చివరికి టికెట్ ధరలు పెరిగేందుకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నాయి. దేశంలో విమాన ప్రయాణాలపై ప్రభావం చూపే కీలక నిర్ణయంగా భావిస్తున్న 60 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని ఇచ్చిన తాజా ఉత్తర్వుపై విమానయాన సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల తమ ఆర్థిక స్థితిపై భారీ ప్రభావం పడుతుందని, చివరికి ప్రయాణికులపై భారం పడేలా ఛార్జీలు పెరగవచ్చని హెచ్చరిస్తున్నాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ తరఫున ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి ప్రముఖ సంస్థలు పౌర విమానయాన కార్యదర్శి సమీర్ సిన్హాకు లేఖ రాశాయి. ఈ ఉత్తర్వు వల్ల విమానయాన సంస్థల ప్రధాన ఆదాయ వనరులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని, కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి పొందేందుకు టికెట్ ధరలను పెంచాల్సి వస్తుందని లేఖలో పేర్కొన్నారు. విమానయాన సంస్థల ప్రకారం సీట్ల కేటాయింపు, ధరల నిర్ణయం వంటి అంశాలు పూర్తిగా వాణిజ్య నిర్ణయాలు. ఈ విషయంలో నియంత్రణ సంస్థల జోక్యం పెరగడం పరిశ్రమ స్వతంత్రతను దెబ్బతీస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ఐ+జూా)కి అన్‌బండిల్డ్ సేవల ఛార్జీలను నియంత్రించే అధికారం లేదని, గత కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ ఎఫ్ఐఏ పేర్కొంది. ప్రారంభంలో ఉచిత సీటు ఎంపిక ప్రయాణికులకు లాభదాయకంగా కనిపించినప్పటికీ, దీని దీర్ఘకాల ప్రభావం ప్రతికూలంగా ఉండవచ్చని సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఛార్జీలు పెరగడం వల్ల ముఖ్యంగా తరచుగా ప్రయాణించే వారు, కుటుంబాలు, బడ్జెట్ ప్రయాణికులు ఎక్కువగా ప్రభావితమవుతారని పేర్కొన్నాయి. ఇంకా అన్ని విమానయాన సంస్థలకు ఒకే విధమైన సీట్ల కేటాయింపు విధానం అమలు చేస్తే, సేవలలో ఉన్న వైవిధ్యం తగ్గిపోతుందని, వినియోగదారులకు ఎంపిక అవకాశాలు తగ్గిపోతాయని వారు తెలిపారు. అలాగే ఈ ఉత్తర్వు జారీ చేసే ముందు తమతో ఎలాంటి సంప్రదింపులు జరగలేదని కూడా విమానయాన సంస్థలు ఆరోపించాయి. మొత్తంగా ఈ ఉత్తర్వును వెంటనే ఉపసంహరించుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను విమానయాన సంస్థలు కోరుతున్నాయి. లేకపోతే, భవిష్యత్తులో ధరల నియంత్రణలో మరింత జోక్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశాయి.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారీ ముప్పు..

## భారత్ పరిస్థితిపై ఆర్బీఐ మాజీ గవర్నర్ వార్నింగ్!



రఘురామ్ రాజన్ హెచ్చరికల ప్రకారం, ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 150-200 డాలర్ల వరకు చేరి, ద్రవ్యోల్బణాన్ని, వడ్డీ రేట్లను పెంచుతాయి. భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది అత్యంత ప్రమాదకరం, రూపాయి విలువ క్షీణించి కరెంట్ అకౌంట్ లోటు పెరుగుతుంది. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా--ఇజ్రాయెల్ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందన్నదే ప్రపంచ ఆర్థిక గమ్యాన్ని నిర్ణయించే కీలక అంశమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘర్షణ ఇప్పటికే ప్రపంచ ఇంధన సరఫరాలో 15 శాతం నుంచి 20 శాతం వరకు అంతరాయాన్ని కలిగించే స్థాయికి చేరుకుంది. కొన్ని దేశాలు తమ నిల్వలను వినియోగిస్తూ తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రిస్తున్నప్పటికీ, యుద్ధం సుదీర్ఘంగా సాగితే ప్రభావం మరింత తీవ్రమవుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 150 డాలర్ల నుంచి 200 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ఇలాంటి ధరలు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని పెంచి, ఆర్థిక వ్యవస్థలను అస్థిరపరచే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే అనేక దేశాలు అధిక ధరల ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ఇంధన ధరల పెరుగుదల వడ్డీ రేట్లను మరింత పెంచే పరిస్థితి తీసుకురావచ్చని రాజన్ వివరించారు. ప్రపంచ చమురు రవాణాలో కీలక పాత్ర పోషించే హార్ముజ్ జలసంధి ప్రాంతం చుట్టూ ఉన్న ఉద్రిక్తతలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి ఆసియా దేశాలు అధికంగా ప్రభావితమవుతాయని ఆయన తెలిపారు. భారతదేశం విషయానికి వస్తే దిగుమతి చేసుకునే ముడి చమురుపై అధిక ఆధారపడటం వల్ల ప్రత్యేకంగా ప్రమాదంలో ఉందని రాజన్ పేర్కొన్నారు. చమురు ధరల పెరుగుదల కరెంట్ అకౌంట్ లోటును పెంచడంతో పాటు రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతుందని ఆయన హెచ్చరించారు. దీర్ఘకాలికంగా సబ్సిడీలతో వినియోగదారులను రక్షించడం సాధ్యం కాదని కూడా స్పష్టం చేశారు. భవిష్యత్తు కోసం వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచడం, ఇంధన వనరులను విభిన్నీకరించడం, సరఫరా గొలుసులను బలోపేతం చేయడం అత్యవసరమని రాజన్ సూచించారు. ఈ సంక్షోభాన్ని ప్రపంచానికి ఒక హెచ్చరికగా భావించి, దేశాలు తమ ఆర్థిక వ్యూహాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన తేల్చిచెప్పారు.

## పాన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఇది తెలుసుకోవాలి.. లేకపోతే ఏం జరుగుతుందంటే..?




పాన్ కార్డ్ వాడుతున్నారా..? అయితే ఏప్రిల్ 1 నుండి మారబోతున్న కొత్త నిబంధనల గురించి మీరు తప్పనిసరిగా తెలుసుకోవాలి. నగదు డిపాజిట్ల నుంచి ఆస్తి కొనుగోళ్ల వరకు, వాహనాల రిజిస్ట్రేషన్ నుంచి హోటల్ బిల్లుల వరకు.. ఆదాయపు పన్ను శాఖ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా మార్చి 31 లోపు మీరు పూర్తి చేయాల్సిన పనులు ఏమిటి? కొత్త రూల్స్ వల్ల సామాన్యులకు కలిగే లాభనష్టాలేంటి? తెలుసుకుందాం.. ఆదాయపు పన్ను శాఖ పాన్ కార్డు నిబంధనలలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. 2026 ఏప్రిల్ 1 నుండి కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు అమలులోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు అందరిపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆధార్ ద్వారా పాన్ పొందే సులభతర ప్రక్రియకు 2026 మార్చి 31 చివరి అవకాశం కానుంది. ప్రస్తుతం కేవలం ఆధార్ కార్డు ద్వారానే పాన్ కార్డు పొందే వెసులుబాటు ఉంది. అయితే ఏప్రిల్ 1 నుండి ఈ నిబంధన మారనుంది. ఏప్రిల్ 1 నుండి కొత్త పాన్ కోసం దరఖాస్తు చేసేవారు పుట్టిన తేదీ రుజువు కోసం జనన ధృవీకరణ పత్రం, ఓటరు కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్ లేదా పాస్‌పోర్ట్ వంటి అదనపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుండి పాత పాన్ ఫామ్‌లు చెల్లవు. కొత్త ఫార్మాట్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. కొత్త నిబంధనల ప్రకారం, పాన్ కార్డుపై పేరు ఇకపై పూర్తిగా ఆధార్‌లోని వివరాల ప్రకారమే ఉంటుంది. కార్డుపై ఉన్న ఇతర పేర్ల గుర్తింపులు తొలగించబడతాయి.

**ఆర్థిక లావాదేవీల్లో కీలక మార్పులు**

కొత్త నిబంధనల ప్రకారం నగదు డిపాజిట్లు, వాహనాల కొనుగోలు, ఇతర లావాదేవీల పరిమితుల్లో మార్పులు చేశారు..

**నగదు డిపాజిట్ పరిమితి:**

ప్రస్తుతం రోజుకు రూ. 50,000 డిపాజిట్ చేస్తే పాన్ అవసరం. కానీ కొత్త రూల్ ప్రకారం, రోజువారీ పరిమితి బదులు వార్షిక పరిమితి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో అన్ని బ్యాంకు ఖాతాల్లో కలిపి రూ. 10 లక్షలు దాటితే పాన్ వివరాలు తప్పనిసరి.

**వాహనాల కొనుగోలు -- అమ్మకం**

ఇప్పటివరకు ఏ వాహనం కొన్నా పాన్ అడిగేవారు. ఏప్రిల్ 1 నుండి వాహనం విలువ రూ.5 లక్షలు దాటితేనే పాన్ కార్డు అవసరం. ద్విచక్ర వాహనదారులకు ఇది ఊరటనిచ్చే అంశం.

**హోటల్ బిల్లులు -- రెస్టారెంట్లు**

హోటల్ చెల్లింపుల పరిమితిని రూ. 50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచారు. అంటే లక్ష రూపాయల లోపు బిల్లులకు పాన్ వివరాలు ఇవ్వక్కర్లేదు.

**రియల్ ఎస్టేట్**

ఆస్తి కొనుగోలు లేదా అమ్మకం విషయంలో ప్రస్తుతం ఉన్న రూ. 10 లక్షల పరిమితిని రూ.20 లక్షలకు రెట్టింపు చేయనున్నారు. 20 లక్షల పైబడిన లావాదేవీలకే పాన్ తప్పనిసరి అవుతుంది.

ఇన్సూరెన్స్ ప్రీమియం

భీమా పాలసీల ప్రీమియం చెల్లింపులు మరియు కంపెనీలతో జరిపే విస్తృత లావాదేవీలకు కూడా పాన్ అనుసంధానం మరింత కఠినతరం కానుంది.

**ఎందుకు ఈ మార్పులు?**

పన్ను ఎగవేతను అరికట్టడం మరియు అధిక విలువ గల లావాదేవీలను సమర్థవంతంగా పర్యవేక్షించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పౌరులు తమ ఆర్థిక కార్యకలాపాలను పారదర్శకంగా ఉంచుకోవడానికి ఈ మార్పులు దోహదపడతాయని ఆదాయపు పన్ను శాఖ భావిస్తోంది. మీరు ఇంకా పాన్ కార్డు పొందకపోయినా లేదా ఏవైనా మార్పులు చేసుకోవాలనుకున్నా, మార్చి 31 లోపు పూర్తి చేయడం ఉత్తమం. ఏప్రిల్ 1 నుండి ప్రక్రియ మరింత భారంగా మరియు అదనపు పత్రాలతో కూడుకుని ఉంటుంది.

## షాకింగ్ న్యూస్.. పెరిగిన స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు.. ఎంతంటే..?



దేశంలో స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతున్నాయి. వీటితో పాటు ల్యాప్‌టాప్ ధరలు కూడా అమాంతం హైక్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రర్షీపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోవడం, మెమెరీ చిప్ ధరలు పెరగడమే కారణాలుగా తెలుస్తోంది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశముంది. స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ కొనుగోలు చేయాలనుకుంటున్నారా..? అయితే మీకు బ్యాడ్ న్యూస్. వీటి ధరలు మరింత పెరుగుతున్నాయి. ఇటీవల కొన్ని బ్రాండ్ల స్మార్ట్‌ఫోన్ ధరలు మార్చి 1వ తేదీ నుంచి పెరగ్గా.. ఇప్పుడు అన్ని కంపెనీల ఫోన్ల ధరలు అధికమవుతున్నాయి. దీనికి అనేక కారణాలు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మెమొరీ చిప్ ధరలు గత కొంతకాలంగా పెరుగుతూ వస్తోన్నాయి. ఇది ఒక కారణం కాగా.. దీంతో పాటు డిర్యామ్, నంద్ స్టోరేజ్ ఖర్చులు కూడా ప్రియం అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రోజురోజుకి పడిపోతుంది. దీని వల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు హైక్ అవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల తయారీకి ఉపయోగించే సెమీ కండక్టర్లు, చిప్‌లు, ఇతర పరికరాలను విదేశాల నుంచి ఎక్కువగా భారత్ దిగుమతి చేసుకుంటుంది. డాలర్ బలపడటం వల్ల వాటికి ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది.

**ప్రతీ నెలలోనూ పెరుగుతున్న ధరలు**

సెమీ కండక్టర్ చిప్ సెట్స్ ధరలు ప్రతీ నెలలోనూ పెరుగుతున్నట్లు స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు చెబుతున్నాయి. 512 జీబీ, 1 టీబీ మాడ్యూల్స్ ధరలు మరింతగా పెరుగుతున్నాయి. ఇక స్మార్ట్‌ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్‌లలో వాడే డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ, స్టోరేజ్ మాడ్యూల్, నంద్ ఫ్లాష్‌కు కొరత ఏర్పడింది. ఏఐ డేటా సెంటర్లను ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న క్రమంలో చిప్‌లు, మెమెరీ కార్డులను వాటికి తరలిస్తున్నారు. దీని వల్ల కొరత కారణంగా వాటి ధరలు గత ఏడాది నవంబర్ నుంచి ఏకంగా 50 శాతం మేర పెరిగాయి. దీని వల్ల స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల తయారీకి అయ్యే ఖర్చు ఎక్కువకావడంతో.. వీటి ధరలను పెంచుతున్నాయి.

**సెకండ్ హ్యాండ్ ఫోన్ల వైపు చూపు**

ల్యాప్‌టాప్ ధరలు 20 నుంచి 25 శాతం వరకు పెరిగాయి. ధరలు పెరుగుతుండటంతో అమ్మకాలు భారీగా పతనమవుతున్నాయి. ఇక స్మార్ట్ ఫోన్ల ధరలు 40 శాతం వరకు పెరిగాయి. ప్రముఖ కంపెనీలైన వివో, శామ్ సంగ్, రియల్ మీ, పోకో, ఒప్పో, వన్ ప్లస్, షియామీ, మోటరోలా కంపెనీలు ధరలను ఒక్కసారిగా పెంచేశాయి. అయితే స్మార్ట్ ఫోన్ల ధరలు పెరగడంతో సెకండ్ హ్యాండ్ ఫోన్ల వైపు కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నట్లు మొబైల్ రీటెయిల్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య 35 శాతం కొత్త ఫోన్ల విక్రయాలు తగ్గాయి. డాలర్ మరింత బలపడి రూపాయి విలువ తగ్గితే ధరలు మరింత పెరగనున్నాయని తయారీ కంపెనీలు చెబుతున్నాయి. దీని వల్ల కొత్తగా ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేసేవారికి షాకే.

## అదిరిపోయే గుడ్‌న్యూస్.. బంగారం ధర భారీగా తగ్గనుందా? కారణాలు ఏంటంటే?



ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతల్లోనూ బంగారం ధరలు తగ్గుతున్నాయి. అమెరికన్ డాలర్ బలం పుంజుకోవడం, కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతుండటంతో పెట్టుబడిదారులు బంగారంపై ఆసక్తి కోల్పోతున్నారు. దీనివల్ల డిమాండ్ తగ్గి, ధరలు పడిపోతున్నాయి. రాబోయే కాలంలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,000 వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల్లో బంగారం ధరలు పెరుగుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో దీనికి విరుద్ధంగా, బంగారం ధరలు తగ్గుతున్నాయి. విశ్లేషకుల ప్రకారం దీనికి ప్రధాన కారణం అమెరికన్ డాలర్ బలపడటమే. డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరుగుతాయి. దీంతో పెట్టుబడిదారులు కొనుగోళ్లకు వెనుకంజ వేస్తారు, డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా ధరలు క్రమంగా పడిపోతాయి. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీ రేట్ల పెంపుపై సంకేతాలు ఇస్తున్నాయి. వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, పెట్టుబడిదారులు బంగారం వంటి లాభం ఇవ్వని ఆస్తుల కంటే బాండ్లు, బ్యాంక్ డిపాజిట్ల వైపు మళ్లుతారు. ఇది కూడా బంగారం ధర తగ్గడానికి మరో ముఖ్య కారణంగా మారింది. స్వల్పకాలంలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,000 నుంచి రూ.1,47,000 మధ్య ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,000 వరకు పడిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అంటే పెట్టుబడిదారులు జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కరెన్సీ మార్పులు, వడ్డీ రేట్లు వంటి అంశాలు బంగారం ధరలపై కీలక ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల పెట్టుబడిదారులు గ్లోబల్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవడం అవసరం.




## బ్యాంక్ అకౌంట్‌లు వాడటం లేదా? అయితే మీరు చాలా నష్టపోతారు చూసోక్కండి!

మీరు ఉపయోగించని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయా? వాటిని మూసివేయకపోతే జరిమానాలు, సైబర్ మోసాలు, జ×దీ×ూ స్కోర్ దెబ్బతినే ప్రమాదం ఉంది. కనీస బ్యాలెన్స్ లేకపోవడం, ఇన్‌యాక్టివ్ అవ్వడం వంటివి ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చు. మీ పాత ఖాతాలను సురక్షితంగా మూసివేయడం ద్వారా అనవసర సమస్యలను నివారించవచ్చు. ఈ రోజుల్లో చాలా మందికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండటం సాధారణం. జీతం ఖాతాలు, జీరో-బ్యాలెన్స్ అకౌంట్లు, పాత జాయింట్ ఖాతాలు వంటి వాటిని కొంతకాలం తర్వాత వాడటం మానేస్తారు. అయితే వాటిని అధికారికంగా మూసివేయకపోవడం భవిష్యత్తులో సమస్యలకు దారితీయవచ్చు. ఖాతాలో డబ్బు లేకపోతే ఎలాంటి ప్రమాదం ఉండదని అనుకోవడం తప్పు. కనీస నిల్వ లేకపోతే బ్యాంకులు జరిమానాలు విధిస్తాయి. దీంతో ఖాతా బ్యాలెన్స్ నెగెటివ్‌లోకి వెళ్లే అవకాశముంది. చాలా కాలం లావాదేవీలు లేకపోతే ఆ ఖాతా ఇన్‌యాక్టివ్‌గా మారుతుంది. మళ్లీ యాక్టివేట్ చేయాలంటే బ్యాంక్ ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది. సాధారణ సేవింగ్స్ ఖాతా నేరుగా క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేయదు. కానీ ఓవర్‌డ్రాఫ్ట్ (ూఴ) సౌకర్యం ఉన్న ఖాతాల్లో బకాయిలు ఉంటే, అవి రుణంగా పరిగణించబడతాయి. దీని ప్రభావం సిబిల్ స్కోర్‌పై పడే అవకాశం ఉంది. పాత ఖాతాలు ఇన్సూరెన్స్ ప్రీమియంలు, జువీ×లు, లేదా ఇతర సేవలతో లింక్ అయి ఉండొచ్చు. ఖాతాలో డబ్బు లేకపోతే చెల్లింపులు బౌన్స్ అవుతాయి. దీనివల్ల అదనపు ఛార్జీలు విధించబడటమే కాకుండా, క్రెడిట్ హిస్టరీ దెబ్బతింటుంది. తక్కువగా ఉపయోగించే ఖాతాలు సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఎక్కువ. మొబైల్ నంబర్ లేదా ఇమెయిల్ అప్‌డేట్ చేయకపోతే అనుమానాస్పద లావాదేవీలపై అలర్ట్స్ రావు.

# దురంధర్2
## కలెక్షన్ల దూకుడు
### తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ




ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. ఢిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు.

'ఇది 1998లో మా అమ్మానాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది.

అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు.




## బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు



## నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు


ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి
గాయని మంగ్లీ ప్రకటన విడుదల

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్గ్గ ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు.

# రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా..

ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.




## మేన రిలీజ్ కానున్న గాయపడ్డ సింహం




టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం మూవీ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. టైజర్ సెటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసు కునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని టైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి.

ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com